జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి ఆదివారం 22 ఫిబ్రవరి 2026 సంపుటి : 1 సంచిక : 54 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516
విక్రం సంవత్సరం – పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ – 1946, ఆషాఢము 17 పుర్నిమంతా – 2081, ఆషాఢము 16 అమాంత – 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి
Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# ఇంటింటికీ డిజిటల్ సేవలు



- టీ ఫైబర్ ఆధ్వర్యంలో అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ కనెక్షన్లు
- ఇప్పటికే 26 జిల్లాల్లో ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లతో రింగ్ కనెక్టివిటీ
- ఈ పరిధిలోకి తాజాగా రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలు
- సీఎం, ఐటీ మంత్రి చొరవతో కేంద్రం రూ.3,185 కోట్ల కేటాయింపు

హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటింటికీ అత్యంత వేగవంతమైన డిజిటల్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. టీ ఫైబర్ ఆధ్వర్యంలో అన్ని పల్లెల్లోనూ ప్రతి ఇంటికి స్వల్ప ఖర్చుతో ఇంటర్నెట్ కనెక్షన్లు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 26 జిల్లాల్లోని సుమారు 9,000 గ్రామాలకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్ రింగ్ కనెక్టివిటీని ఏర్పాటు చేయగా.. ఈ పరిధిలో ఇప్పటివరకు లేని రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలను కూడా చేర్చారు. ఈ కనెక్టివిటీ వల్ల వైరు తెగి ఎక్కడైనా అంతరాయం కలిగినా ఆ గ్రామంలో సేవలు నిలిచిపోవు. అన్ని గ్రామపంచాయతీలను ఇదే విధానంలో అనుసంధానం చేస్తారు. ఈ మూడు జిల్లాల్లో రింగ్ కనెక్టివిటీ కోసం - మిగతా2లో



# ముందస్తు భగభగలు!

- పది రోజుల ముందే ముగిసిన శీతాకాలం
- మూడు రోజులుగా రోజుకు సగటున 0.5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల

హైదరాబాద్

చలికాలం ముగిసింది. పది రోజుల ముందే రాష్ట్రంలో చలి తీవ్రత పూర్తిగా తగ్గిపోగా... వేసవి భగభగలు అప్పుడే మొదలయ్యాయి. సాధారణంగా రాష్ట్రంలో చలికాలం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి చివరి వరకు ఉంటుంది. కానీ ఈసారి నవంబర్ నెలలోనే చలి తీవ్రత అధికంగా నమోదు కాగా... డిసెంబర్‌లో తీవ్రస్థాయికి చేరింది. జనవరి నెలాఖరు వరకు తీవ్రత ఎక్కువగా ఉండగా... ఫిబ్రవరి రెండో వారం నుంచి చలి క్రమంగా తగ్గింది. ప్రస్తుతం పది రోజుల ముందే చలి తీవ్రత పూర్తిగా తగ్గుముఖం పట్టగా... చిటపట ఎండలు - మిగతా2లో

# 'అందరికీ కృత్రిమ మేధ సాంకేతికత'

- న్యూఢిల్లీ 'ఏఐ ఇంపాక్ట్' డిక్లరేషన్‌కు ఆమోదం
- 86 దేశాలు, రెండు అంతర్జాతీయ సంస్థల సంతకాలు
- ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమమే ధ్యేయం
- ఏడు కీలక మూలస్తంభాలే డిక్లరేషన్‌కు ఆధారం
- ఏఐ టెక్నాలజీని పరస్పరం పంచుకోవాలని నిర్ణయం

5







## ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 30 బిలియన్ డాలర్లు

- వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం చేసుకుందాం
- భారత ప్రధాని మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు
- లూలా డా సిల్వా నిర్ణయం
- అరుదైన ఖనిజాల్లో సహకారానికి ఒప్పందంపై సంతకాలు
- అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమన్న ప్రధాని మోదీ

5



## మేడిన్ ఇండియా చిప్.. దేశాభివృద్ధికి అత్యంత కీలకం

- ప్రధాని మోదీ ఉద్ఘాటన
- ఉత్తర ప్రదేశ్‌లో హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్ ఉమ్మడి ఫ్యాక్టరీకి శంకుస్థాపన

# దేశం ఆత్మనే.. కాంగ్రెస్

- ప్రజల మనసు గెలవడంతోనే ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్ల శాతం పెరుగుతోంది
- డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భారత దేశ ఆత్మగౌరవం గ్రామాల్లో ఉందని నమ్మే పార్టీ కాంగ్రెస్
- ఇటీవల కొన్ని పార్టీలు రాజ్యాంగాన్ని రద్దు చేయాలని, లేదంటే సమూలంగా మార్చేయాలనే కుట్ర చేస్తున్నాయి



పనిచేసే వారికే కాంగ్రెస్‌లో తగిన ప్రాధాన్యం

పార్టీని, దేశాన్ని ఎవ్వరూ విడదీయలేరు


వికారాబాద్

కాంగ్రెస్‌లో ఏ కోటా ఉండదు.. కేవలం మెరిట్ కోటా మాత్రమే ఉంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బాగా పనిచేసే వారికి పార్టీలో తగిన ప్రాధాన్యం దక్కుతుందని చెప్పారు. వికారాబాద్‌లోని అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్షులుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. దేశం ఆత్మనే కాంగ్రెస్.. కాంగ్రెస్ పార్టీని దేశాన్ని ఎవ్వరూ విడదీయలేరు అని చెప్పారు. దేశ స్వాతంత్ర్యానికి 140 ఏళ్ల ముందే కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని.. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్.. కాంగ్రెస్ తెచ్చిన స్వాతంత్ర్యం.. ఇచ్చిన రాజ్యాంగాన్ని వినియోగించుకొని ఉద్భవించిన పార్టీలు ఇప్పుడు కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటున్నాయని ఎద్దేవా చేశారు. భారత దేశ ఆత్మగౌరవం గ్రామాల్లో ఉందని నమ్మే పార్టీ కాంగ్రెస్ అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇటీవల కొన్ని పార్టీలు రాజ్యాంగాన్ని రద్దు చేయాలని, లేదంటే సమూలంగా మార్చేయాలనే కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. మహాత్మాగాంధీ, నెహ్రూ వంటి నాయకులు దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లారన్నారు. గాంధీ బ్రిటిష్ వారిపై - మిగతా2లో

## దేశ రాజధానికి ఉగ్ర ముప్పు


నిఘా వర్గాల హెచ్చరికలు

2లో



## కుప్పకూలిన ఆశలకు ఏడాది


- ఎస్ఎల్‌బీసీ సొరంగం కుంగడంతో 8 మంది కార్మికుల దుర్మరణం
- అందులోనే ఉండిపోయిన ఆరుగురి మృతదేహాలు
- ఈనెల 17న అవుట్‌లెట్ నుంచి ప్రారంభమైన తవ్వకం పనులు
- ఇన్‌లెట్ వైపు నుంచి తవ్వకాలపై రాని స్పష్టత
- సవాలుగా మారిన 9.5 కి.మీ మేర సొరంగం తవ్వకం



# కుప్పకూలిన ఆశలకు ఏడాది

నాగర్‌కర్నూల్

శ్రీశైలం ఎడమగట్టు కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్ట్ సొరంగం కుంగిన ఘోర ప్రమాదానికి ఆదివారం నాటికి ఏడాది పూర్తికానుంది. గతేడాది ఫిబ్రవరి 22న నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట వద్దనున్న ఇన్‌లెట్ వద్ద సొరంగం కుప్పకూలడంతో ఘోర ప్రమాదం సంభవించింది. టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) ద్వారా సొరంగం తవ్వకం పనులు చేపడుతున్న సమయంలో అకస్మాత్తుగా సొరంగం పైకప్పు కుప్పకూలడంతో శిథిలాల కింద పడి 8 మంది కార్మికులు మరణించారు. వీరిలో ఇద్దరి కార్మికుల మృతదేహాలను మాత్రమే బయటకు తీయగలిగారు. ఘోర ప్రమాదం చోటుచేసుకుని ఏడాది కావస్తున్నా ఇప్పటికీ సొరంగం ఇన్‌లెట్ వైపు నుంచి తవ్వకాలపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు.



**అత్యాధునిక సాంకేతిక..నిపుణులు రంగంలోకి దిగినా..**

ఘోర ప్రమాదంలో శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను వెలికి తీసేందుకు గంటల వ్యవధిలోనే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ, ఇండియన్ ఆర్మీ తదితర బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. కేరళ నుంచి కడావర్ డాగ్స్‌తో పాటు ఉత్తరాఖండ్ గనుల్లో నిపుణులుగా ఉన్న ర్యాట్‌హోల్ మైనర్స్(ఇరుకైన ప్రదేశాల్లో చిక్కుకున్నవారిని రక్షించే కార్మికులు) రోజుల తరబడి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సంస్థలు ఎన్జీఆర్ఐ, రోబోటిక్స్, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ (భూమి ఉపరితలాన్ని తవ్వకుండానే కింద ఉన్న వస్తువులు, మట్టిపొరలను గుర్తించడానికి రేడియోతరంగాలను ఉపయోగించే ఒక అధునాతన సాంకేతిక..ఈ టెక్నాలజీ కచ్చితంగా మృతదేహాలను మ్యాపింగ్ చేయగలదు), టన్నెల్ నిపుణుల సహాయాన్ని ప్రభుత్వం తీసుకుంది.

ఇద్దరు కార్మికుల మృతదేహాలు మాత్రమే లభించగా, మిగతా ఆరుగురి మృతదేహాలు శిథిలాల కిందే ఉండిపోయాయి. 50 రోజుల పాటు సహాయక చర్యలను కొనసాగించిన ప్రభుత్వం అనంతరం నిలిపివేసింది. మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలను కలెక్టర్ సంతోష్ అందించారు.

**అవుట్‌లెట్ వైపు నుంచి మొదలైన తవ్వకాలు..**

దోమలపెంట ఇన్‌లెట్ వైపు నుంచి పనులు ప్రారంభించే అవకాశం లేకపోవడంతో అవుట్‌లెట్ వైపు నుంచి పనులను మొదలుపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం అచ్చంపేట మండలం మన్నెవారిపల్లె వద్దనున్న అవుట్‌లెట్ సొరంగం వద్ద హెలీబోర్న్ మాగ్నటిక్ సర్వే (హెలీకాప్టర్ సహాయంతో భూగర్భజలాలు, ఖనిజాలు, రాతినిర్మాణాలను గుర్తించడానికి ఉపయోగించే అధునాతన సాంకేతికత)ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. సర్వే ముగిసిన తర్వాత ఈనెల 17నుంచి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ మెథడ్(ఏటీఎం) పద్ధతిలో బ్లాస్టింగ్ ద్వారా సొరంగం తవ్వకాలను చేపడుతున్నారు.

**ఇంకా 9.5 కి.మీ మేర సొరంగం పెండింగ్..**

మొత్తం 43.931 కి.మీ మేర ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని తవ్వాల్సి ఉండగా, ఇరువైపుల నుంచి పనులు మొదలుపెట్టారు. ఇన్‌లెట్ నుంచి 13.936 కి.మీ వరకు తవ్వకం పూర్తికాగా అక్కడే ప్రమాదం జరిగి టీబీఎం ధ్వంసమైంది. అవుట్‌లెట్ నుంచి ఇప్పటివరకు 20.435 కి.మీ మేర తవ్వకం పూర్తికాగా ఇంకా 9.533 కి.మీ సొరంగాన్ని తవ్వాల్సి ఉంది. అవుట్‌లెట్ నుంచి సొరంగం లోపల 20 కి.మీ దూరంలో తవ్వకాలు పూర్తిచేయడం సవాలుగా మారింది.

# కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్తత

కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల విషయంలో కాంగ్రెస్, భాజపా నాయకుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు ఉద్రిక్తతలకు దారితీశాయి. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ వేదికగా భూముల విషయంలో చర్చకు రెండు పార్టీలు శుక్రవారమే పిలుపునిచ్చాయి. దీంతో పోలీసులు  శనివారం ఉదయం నుంచే ఆయా పార్టీల నాయకుల్ని ఎక్కడికక్కడ అరెస్టు చేశారు.  శిశుమందిర్ వద్దకు వచ్చిన కాంగ్రెస్ శ్రేణుల్ని అదుపులోకి తీసుకొని జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఎస్పీ అభ్యర్థన మేరకు బయటకు రాకుండా స్వచ్ఛందంగా క్యాంప్ కార్యాలయంలో ఉండిపోయారు.



రామారెడ్డి మండలం పోసానిపేట్ మాజీ సర్పంచి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి పోలీసు బందోబస్తును దాటి కారుతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందుకు దూసుకొచ్చారు. గేటు ముందు దిగి ఎమ్మెల్యే డౌన్ డౌన్, షబ్బీర్ అలీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. దీంతో భాజపా శ్రేణులు భగ్గుమన్నాయి. వెంటనే ఆయనపై దాడికి యత్నించడంతో పోలీసులు ఆయన్ను అక్కడి నుంచి తరలించారు. భాజపా కార్యకర్తలు ఆగ్రహంతో మహేందర్‌రెడ్డి కారును ధ్వంసం చేసి బోల్తా కొట్టించారు. కాసేపు పోలీసులు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. అదే సమయంలో పలువురు ఆ కారుకు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, శాసనసభలో పార్టీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డి, మరికొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వస్తున్నట్లు ప్రచారం జరిగింది. పట్టణంలో మరింత ఉద్రిక్తత నెలకొంది. మహేశ్వర్‌రెడ్డిని, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హైదరాబాద్‌లో హౌస్ అరెస్టు చేశారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డికి వస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డిని మేడ్చల్‌లో అరెస్టు చేశారు. పోలీసుల చర్యను ఏలేటి, ఈటల తీవ్రంగా ఖండించారు. మహేందర్‌రెడ్డిని, పెట్రోల్ పోసి నిప్పంటించిన ఇద్దరు భాజపా కార్యకర్తలను అరెస్టు చేసినట్లు కామారెడ్డి ఎస్పీ రాజేష్‌చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.

**వివాదం ఇలా మొదలైంది...**

కామారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఆయన తండ్రి.. ఇద్దరూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల్ని అరోరా కళాశాలకు కట్టబెట్టారని ఆరోపించారు. వాటిని నిరూపించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అనంతరం ఆయా పార్టీల ద్వితీయశ్రేణి నాయకులు విలేకర్ల సమావేశాల్లో సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకుంటూ వచ్చారు. శనివారం సరస్వతీ శిశు మందిర్ వద్దకు ఆధారాలతో రావాలని ఎన్ఎస్‌యూఐ నేత సందీప్‌కు వెంకటరమణారెడ్డి ఫోన్ చేశారు. ఈ ఆరోపణల పర్వం ఇలా వివాదానికి దారి తీసింది.

తేలేదాకా ఊరుకోను: ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

తన కుటుంబీకులపై చేసిన ఆరోపణల్లో నిజమేంటో తేలేదాకా ఊరుకోనని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వస్తానని, కాంగ్రెస్ నాయకులూ వచ్చి ఆరోపణలు నిరూపించాలని సవాల్ చేశారు. తన తప్పు నిరూపిస్తే అక్కడికక్కడే రాజీనామా చేస్తానని అన్నారు.

వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి కాంగ్రెస్ అల్లర్లు: రామచందర్‌రావు

వెంకట రమణారెడ్డి క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నానని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రాజకీయ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికే ఈ విధమైన అల్లర్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కామారెడ్డి ఘటనను ఖండిస్తున్నట్టు భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ తెలిపారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుని గృహనిర్బంధం

బాన్సువాడ, కామారెడ్డి ప్రాంతాల్లో ఆదివారం పర్యటించాలని నిర్ణయించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును పోలీసులు శనివారం రాత్రి ఆయన నివాసంలో నిర్బంధించారు. పోలీసుల చర్యలను కేంద్రమంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా ఖండించారు.

## రైల్వేకోచ్ ఫ్యాకటరీలో ట్రయల్‌రన్

కాజీపేట

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామ శివారులో చివరిదశ నిర్మాణంలో ఉన్న రైల్వే మల్టీపుల్ కోచ్‌ఫ్యాక్టరీ యూనిట్‌లో శనివారం అధికారులు ఒక కోచ్‌తో ఉన్న ఇంజిన్‌ను ట్రయల్ రన్‌గా నడిపించారు. రైల్వే మల్టీపుల్ యూనిట్‌లో చిన్నచిన్న పనులు చివరి దశలో ఉన్నాయి. పనులన్నీ పూర్తయ్యాక ఈ యూనిట్‌ను ఏప్రిల్ లేదా, మే నెలలో అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు.  పన్నెండున్నర కిలోమీటర్ల ట్రాక్ నిర్మించి ట్రాక్ ఫిట్‌నెస్, స్పీడ్‌ను తనిఖీ చేసేందుకు మొట్టమొదటిసారి కాజీపేట రైల్వేస్టేషన్ యార్డు నుంచి రైల్వే మల్టీపుల్ యూనిట్ వరకు కోచ్‌తో జత చేసిన డీజిల్ ఇంజిన్‌ను ట్రయల్‌రన్‌గా నడిపించారు. ట్రయల్ ఇంజిన్ ఎటువంటి ఆటంకం లేకుండా మల్టీపుల్ యూనిట్ వరకు వస్తున్న క్రమంలో అధికారులు, సిబ్బంది ఆనందోత్సవాల మధ్య స్వాగతం పలికారు. యూనిట్ వద్ద ఇంజిన్ ముందు పూజ చేసి మెయిన్‌షెడ్ బేలోకి పంపించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వీఎన్ఎల్ అధికారులు సీపీఎం సాయిప్రసాద్, జీజీఎం మెకానికల్ మురళీకృష్ణ, సివిల్ డీజీఎం శర్మ, పవర్‌మెక్ ప్రాజెక్ట్ వైస్ ప్రెసిడెంట్ రామచంద్రరాజు, ఏజీఎం కృష్ణ, సీనియర్ మేనేజర్ ప్రేమ్‌సాగర్, పవర్ మెక్ ఇంజనీరింగ్ బృందం పాల్గొన్నారు.    కాజీపేటకు అప్పటి యూపీఏ ప్రభుత్వంలో 2010--11లో రైల్వే వ్యాగన్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ మంజూరైంది. ఎన్నో ఉద్యమాల ఫలితంగా 2023 ఫిబ్రవరిలో 160 ఎకరాల విస్తీర్ణంలో రూ.560 కోట్లతో రైల్వే వ్యాగన్ మాన్యుఫాక్చరింగ్ షెడ్ మంజూరైంది. తర్వాత కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ మేరకు 2023లో జిల్లాకు ప్రధాని నరేంద్రమోదీ వచి?చనప్పుడు రైల్వే మల్టిపుల్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు.

## దేశం ఆత్మనే.. కాంగ్రెస్

-మొదటిపేజీ తరువాయి

తిరగబడితే వారు ఆయనపై కనీసం లాఠీ కూడా ఎత్తలేదని, కానీ మన దేశానికి చెందిన ఓ పార్టీ నాయకుల తుపాకీ గుండ్లకు బలి కావాల్సి వచ్చిందని తెలిపారు. గాన్ధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. త్యాగాల చరిత్ర కలిగిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ 4వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారని గుర్తు చేశారు.

**పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయొద్దు..**

'డీసీసీ అధ్యక్షులుగా ఎన్నికైనవారు జిల్లాకు అధిపతులమని భావించొద్దు.. వ్యతిరేకించిన వారిని అణచివేసే ప్రయత్నాలు చేయొద్దు'అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ప్రతీ నాయకుడి ఇంటికి వెళ్లి కలిసి మద్దతు అడిగానని గుర్తు చేసుకున్నారు. అందరూ కలిసి పనిచేయడంతోనే రెండున్నర శాతం ఉన్న కాంగ్రెస్ ఓట్లను 40 శాతానికి తెచ్చుకోవడంతోపాటు అధికారంలోకి రాగలిగామని స్పష్టం చేశారు. 119 నియోజకవర్గాల్లో 42 లక్షల డిజిటల్ సభ్యత్వాలు చేయించామన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యేలుగా అవకాశం ఇచ్చామని చెప్పారు. డీసీసీ అధ్యక్ష పదవులను దుర్వినియోగం చేయొద్దని, పార్టీ విశ్వాసాన్ని దెబ్బతీయొద్దని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు శాతం తేడాతో అధికారంలోకి వచ్చిన మనం పార్లమెంట్ ఎన్నికల్లో 4 శాతం ఓట్లు పెంచుకున్నామని, మున్సిపల్ ఎన్నికల్లో 12 శాతానికి చేరుకున్నామని, ప్రజల మనసు గెలవడంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు.

**గొంతు నొక్కే కుట్ర**

బీజేపీ కాంగ్రెస్ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పార్లమెంటులో రాహుల్‌గాన్ధీని మాట్లాడనీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, బడుగులు, బలహీన వర్గాల గొంతు నొక్కే కుట్ర చేస్తోందని ఆరోపించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో క్వాలిటీ లీడర్‌ప్‌ను తయారు చేయటమే సంఘటన్ సృజన్ అభియాన్ లక్ష్యమని చెప్పారు. దేశంలో సంస్థాగత మార్పునకు ఇది దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, శిక్షణ నిర్వహణ కమిటీ చైర్మన్ టి.రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ డిజిటల్ సేవలు

-మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వానికి పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు వినతి పత్రాలు అందజేశారు. తాజాగా భారత్ నెట్ సవరణ కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో రింగ్ కనెక్టివిటీకి కేంద్రం రూ.432 కోట్లు మంజూరు చేసింది. వీటితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లను పదేళ్ల పాటు మెయింటెనెన్స్ చేసేందుకు మరో రూ.2,697 కోట్లను, పరిపాలన వ్యయం నిధులు కలిపి డిజిటల్ సేవల కోసం రాష్ట్రానికి రూ.3,185 కోట్లు కేంద్రం మంజూరుచేసింది. ప్రస్తుతం టీ ఫైబర్ ఆధ్వర్యంలో రింగ్ కనెక్టివిటీ ఉన్న జిల్లాల నుంచి నాలుగు గ్రామాలను ఎంపిక చేసుకొని అక్కడి అన్ని ఇళ్లకు ఉచితంగా ఇంటర్నెట్ కనెక్షన్లను అందిస్తున్నారు. ఈ ప్రయత్నం విజయవంతం కావడంతో కేంద్ర ప్రభుత్వం దీన్ని సక్సెస్ ఫుల్ మోడల్‌గా గుర్తించింది. రింగ్ కనెక్టివిటీ లేని జిల్లాలకు కూడా ఈ విధానాన్ని వర్తింప చేయడానికి ఆమోదం తెలిపింది.

మరో ప్రత్యేక సంస్థ ఏర్పాటు...!: భారత్‌నెట్ కార్యక్రమం (ఏబీపీ) అమలు కోసం రాష్ట్రంలో మరో సంస్థను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రత్యేక సంస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాన వాటా ఉంటుంది. భారత్‌నెట్ ఫేజ్-2 (టీఫైబర్)లో పెండింగ్ పనులను డీబీఎన్, బీబీఎన్ఎల్, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం పరిధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది. కేంద్రం అనుమతించిన నిధికన్నా చేసిన అదనపు ఖర్చును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సూచించింది.

ఏబీపీ కార్యక్రమాన్ని 12,769 గ్రామాల్లో అమలు చేసేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,946 గ్రామాల్లో రింగ్ కనెక్టివిటీ అప్‌గ్రేడ్, 36 గ్రామాల్లో కొత్తగా రింగ్ కనెక్టివిటీ అమలు చేయాలి. ప్రస్తుతం 10,787 గ్రామాల్లో రింగ్ కనెక్టివిటీ ఉంది.

భారత్‌నెట్ ఆస్తులన్నీ జీఐఎస్ మ్యాపింగ్ చేయాలి. ఈ నిధులను కొత్తసంస్థకు డిజిటల్ భారత్‌నిధి (డీబీఎన్) నేరుగా విడుదల చేస్తుంది.

గ్రామాల్లో ఇంటింటికీ ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్లు ఇచ్చేందుకు భారత్‌నెట్‌ఉద్యమీస్‌ను నియమించాలి. రానున్న ఐదేళ్లలో గ్రామాల్లో ఈ కనెక్షన్లు అందించాలి. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీలు, పంచాయతీ కార్యాలయాల్ని అనుసంధానం చేయాలి. ఏబీపీ కార్యక్రమం కింద సెట్‌అప్‌బాక్సు, ఇతర ఖర్చుల కింద 2,93,266 కనెక్షన్లకు కేంద్రం సబ్సిడీ అందిస్తుంది.

తెలంగాణలోని ప్రతి ఇంటికి కనీసం 25 ఎంబీపీఎస్ డౌన్‌లోడ్ వేగంతో.. 691 బ్లాకులకు బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ లీజ్డ్‌లైన్స్ కనెక్టివిటీ అందించాలి.

## ముందస్తు భగభగలు!



-మొదటిపేజీ తరువాయి

నమోదవుతున్నాయి. రెండ్రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. శనివారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 35 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదైంది. ఈనెల 18వ తేదీ నుంచి రాష్ట్రంలో నమోదు కావాల్సిన సగటు ఉష్ణోగ్రతల కంటే అధికంగా నమోదవుతుండటం గమనార్హం.

**వాతావరణంలో మార్పులతో...**

ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల ఆధారంగా సీజన్ మార్పును గమనించవచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలోని వాతావరణం వేగంగా మారుతోంది. ఉత్తర ప్రాంతం నుంచి చలి గాలుల తీవ్రత తగ్గింది. ప్రస్తుతం చలి తీవ్రంగా ఉండాల్సి ఉండగా... పొడి వాతావరణం నమోదవుతుండటంతో వేగంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫలితంగా పగటిపూట ఉక్కపోత అధికంగా నెలకొంటోంది. గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో సీజన్‌లు ముందుకు జరుగుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈసారి రాష్ట్రంలో ముందస్తు వేసవి ప్రభావం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.  ఒకట్రెండు రోజుల్లో వేసవి సీజన్ అంచనాలను వాతావరణ శాఖ విడుదల చేసే అవకాశం ఉంది. శనివారం రాష్ట్రంలో ప్రధాన నగరాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 36.4 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 16.1 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఆదిలాబాద్, ఖమ్మం, భద్రాచలం, మహబూబ్‌నగర్ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 1 నుంచి 2 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

# ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 30 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ

రాబోయే ఐదేళ్లలో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 30 బిలియన్ డాలర్లకు చేర్చాలని భారత్, బ్రెజిల్ లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. అరుదైన ఖనిజాల విషయంలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయానికొచ్చాయి. ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా శనివారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. రక్షణ, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు తదితర కీలక రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్--బ్రెజిల్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. ఉగ్రవాదం విషయంలో భారత్, బ్రెజిల్ దేశాలది ఒకేమాట అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదులు, ఉగ్రవాద పోషకులు మానవాళికి అతిపెద్ద శత్రువులు అని తేల్చిచెప్పారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు పరిష్కారం కావాలంటే అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరం అని పునరుద్ఘాటించారు. సంస్కరణలకు భారత్, బ్రెజిల్ మద్దతిస్తున్నాయని తెలిపారు.

లూలా డా సిల్వాతో భేటీ అనంతరం మోదీ మీడియాతో మాట్లాడారు. లాటిన్ అమెరికాలో భారత్‌కు బ్రెజిల్ అతిపెద్ద వ్యాపార భాగస్వామి అని గుర్తుచేశారు. వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 30 బిలియన్ డాలర్లకు చేర్చడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం అంటే కేవలం అంకెలు కాదని.. విశ్వాసానికి ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. భారత్, బ్రెజిల్ మధ్య మొత్తం తొమ్మిది ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.

**ఇరుపక్షాలూ లాభపడే భాగస్వామ్యం**

భారత్, బ్రెజిల్ మధ్య దశాబ్దాలుగా వాణిజ్య బంధం కొనసాగుతోంది. 2024--25లో ద్వైపాక్షిక వాణిజ్యం 12 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత్ నుంచి బ్రెజిల్‌కు ఎగుమతుల విలువ 6.77 బిలియన్ డాలర్లు



కాగా, దిగుమతుల విలువ 5.43 బిలియన్ డాలర్లు. అరుదైన ఖనిజాల విషయంలో సహకారానికి బ్రెజిల్‌తో ఒప్పందం కుదిరిందని ప్రధాని మోదీ వెల్లడించారు. సుస్థిరమైన సప్లై చైన్స్ నిర్మించడానికి ఇదొక కీలకమైన చర్యగా అభివరి?ణంచారు. డిజిటల్ భాగస్వామ్యంపై భారత్, బ్రెజిల్ ఒక ఉమ్మడి డిక్లరేషన్‌ను ఆమోదించాయి. మైనింగ్, ఎంఎస్ఎంఈ, ఆరోగ్య సంరక్షణ, సంప్రదాయ విజ్ఞానంపై ఒక అవగాహనా ఒప్పందం(ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. రక్షణ రంగంలో భారత్--బ్రెజిల్ భాగస్వామ్యం కొనసాగుతూనే ఉంటుందని ప్రధానమంత్రి తేల్చిచెప్పారు. పరస్పర విశ్వాసం, వ్యూహాత్మక సహకారానికి ఇదొక గొప్ప ప్రతీక అని వెల్లడించారు. ఇరుపక్షాలూ లాభపడే భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. భారత్--బ్రెజిల్ ఒక్కటైతే గ్లోబల్ సౌత్ గొంతుక మరింత బలం పుంజుకుంటుందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య దేశాలుగా కలిసికట్టుగా పనిచేస్తూ గ్లోబల్ సౌత్ ప్రాధాన్యతలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఏ సమస్యనైనా సరే చర్చలు, దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు.

**భారత్, బ్రెజిల్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలి**

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను లూలా డా సిల్వా తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని ఏ ఒక్క మతంతో గానీ, జాతితో గానీ ముడిపెట్టొద్దని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ తరుణంలో భారత్--బ్రెజిల్ మధ్య సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత పెరగాలని స్పష్టంచేశారు. గ్లోబల్ సౌత్‌లో భారత్, బ్రెజిల్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలని తెలిపారు. రెండు దేశాలు డిజిటల్ సూపర్ పవర్‌గా, పునరుత్పాదక ఇంధన రంగంలో సూపర్ పవర్‌గా మారాయని వెల్లడించారు. సంఘర్షణ కొనసాగుతున్న తరుణంలో సుస్థిరాభివృద్ధి, శాంతి సాధ్యం కాదని తేల్చిచెప్పారు. 20వ శతాబ్దపు టైప్‌రైటర్లపై 21వ శతాబ్దపు సాఫ్ట్‌వేర్‌ను నడిపించలేమంటూ గత ఏడాది బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను సిల్వా గుర్తుచేశారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు చేపట్టాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలు అత్యంత కీలకమని చెప్పారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం పొందడానికి భారత్, బ్రెజిల్‌కు సహజంగానే హక్కు ఉందని స్పష్టంచేశారు. గ్లోబల్ సౌత్ గొంతుకు బలంగా వినిపించాలంటే రెండు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలన్నారు.

# 'అందరికీ కృత్రిమ మేధ సాంకేతికత'

న్యూఢిల్లీ

ఆధునిక కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతను ప్రపంచ దేశాలు పరస్పరం పంచుకొనే దిశగా కీలకమైన ముందడుగు పడింది. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ(అందరికీ సంక్షేమం, అందరికీ సంతోషం) అనే స్ఫూర్తితో భారత్ రూపొందించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ప్రపంచ దేశాలు ఆమోదించాయి. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు సందర్భంగా శనివారం ఈ డిక్లరేషన్‌పై 86 దేశాలు, రెండు అంతర్జాతీయ సంస్థలు సంతకాలు చేశాయి. అమెరికా, యూకే, చైనా, ఫ్రాన్స్ తదితర దేశాలు ఇందులో ఉన్నాయి. మానవాళి బాగు కోసం ఏఐ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ఇదొక మైలురాయి అని నిపుణులు చెబుతున్నారు. కృత్రిమ మేధ ప్రయోజనాలను అందరూ సమానంగా పంచుకోవాలని న్యూఢిల్లీ డిక్లరేషన్ నిర్దేశిస్తోంది.

అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేసుకోవడం, బహుళ భాగస్వాముల మధ్య అనుసంధానం, దేశాల జాతీయ సార్వభౌమత్వాన్ని గౌరవించడం, ఏఐని మరింత ముందుకు తీసుకెళ్లడం, ఏఐ టెక్నాలజీ వినియోగంలో భద్రమైన, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్ నిర్మించడం డిక్లరేషన్ ప్రధాన లక్ష్యం. ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ ఏఐ సాంకేతికతను అందించడమే ధ్యేయం.

**అంతర్జాతీయ సహకారమే పునాది**

ఏడు కీలకమైన మూలస్తంభాల ఆధారంగా న్యూఢిల్లీ డిక్లరేషన్ రూపొందించారు. ఏఐ వనరుల ప్రజాస్వామీకరణ, ఆర్థిక వృద్ధి--సామాజిక సంక్షేమం, భద్రమైన--విశ్వసనీయమైన ఏఐ, శాస్త్రీయ విజ్ఞానం కోసం ఏఐ, సామాజిక సాధికారత సాధన, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్, సుస్థిరమైన, ప్రభావవంతమైన, నూతన ఏఐ వ్యవస్థల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించారు. డిక్లరేషన్‌కు అంతర్జాతీయ ఏఐ సహకారమే పునాదిగా నిలుస్తోంది. ఢిల్లీలో అట్టహాసంగా జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'శనివారం ఈ డిక్లరేషన్ ఆమోదంతో ముగిసింది. ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని, ఈ విషయంలో పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలని సదస్సులో పాల్గొన్న దేశాలు నిర్ణయానికి వచ్చినట్లు అధికార వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. ప్రపంచ ఆర్థిక పరివర్తనలో ఏఐ




పోషించబోయే పాత్రను డిక్లరేషన్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏఐ ఎకోసిస్టమ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకతను వివరించారు. తక్కువ ఇంధనంతో పనిచేసే ఏఐ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైన్స్, పరిపాలన, ప్రజాసేవల పంపిణీలో ఏఐ వినియోగం పెంచుకోవాలని స్పష్టంచేశారు.

**ఈయూ, ఐఎఫ్ఏడీ ఆమోదం**

న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన వాటిలో రష్యా, ఆస్ట్రేలియా, బెల్జియం, భూటాన్, బ్రెజిల్, కెనడా, డెన్మార్క్, ఇస్తోనియా, ఇథియోపియా, జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్, ఐర్లాండ్, ఇండోనేసియా, ఇరాన్, హంగేరీ, గ్రీస్, జర్మనీ, ఫిన్‌లాండ్, మెక్సికో, యూఏఈ, ఉక్రెయిన్, సింగపూర్, దక్షిణ కొరియా, శ్రీలంక, స్వీడన్, టాంజానియా, స్విట్జర్లాండ్, నార్వే, ఒమన్, ఫిలిప్పైన్స్, పెరూ, రొమేనియా, నేపాల్, మయన్మార్, న్యూజిలాండ్ తదితర దేశాలున్నాయి. అంతర్జాతీయ సంస్థలైన యూరోపియన్ యూనియన్(ఈయూ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్(ఐఎఫ్ఏడీ) సైతం డిక్లరేషన్‌ను ఆమోదించాయి.

**సమతుల్యం అత్యంత కీలకం: అశ్వినీ వైష్ణవ్**

ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'మానవ కేంద్రీకృత ఏఐ దార్శనికత'ను ప్రపంచదేశాలు ఆమోదించాయని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. కృత్రిమ మేధ వనరులను ప్రజాస్వామీకరించడం వల్ల ఏఐ సేవలు, సదుపాయాలు, సాంకేతికత ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఆర్థిక ప్రగతి, సామాజిక సంక్షేమాన్ని సమతుల్యం చేసుకోవడం అత్యంత కీలకమని ఉద్ఘాటించారు.

ఆర్థిక ప్రగతిని మాత్రమే కాకుండా సామాజిక సామరస్యాన్ని దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ వినియోగంలో భద్రత, విశ్వాసం ముఖ్యమైన అంశాలేనని చెప్పారు. భద్రమైన, విశ్వసనీయ, బలమైన ఐఏ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించుకోవాలని పేర్కొన్నారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొన్న దేశాలన్నీ పరస్పరం కలిసి పని చేయడానికి ముందుకొచ్చాయని వైష్ణవ్ స్పష్టంచేశారు. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' సూక్తిని ప్రపంచ దేశాలు ఉమ్మడిగా ఆమోదించాయని స్పష్టంచేశారు.

## యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు...
## జైషే అంతర్జాతీయ కుట్ర!

పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జీవవీ) ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులు గా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి. జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం. ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది. ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు.


## దేశ రాజధానికి ఉగ్ర ముప్పు



దిల్లీ

దేశ రాజధాని దిల్లీలో ఉగ్ర దాడులు జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్ర సంస్థ లష్కరే తయ్యిబా దిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని వివిధ ప్రాంతాలే లక్ష్యంగా దాడులకు కుట్ర పన్నినట్లు వెల్లడించాయి. ఇందుకు భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశముందన్నాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు దిల్లీలో హైలర్ట్ ప్రకటించాయి. దేవాలయాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో అదనపు సిబ్బందిని మోహరించాయి. బాంబ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. ఈ నెల 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని పోలీసులు స్థానికులను కోరారు. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో.. నిఘా వర్గాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు.

## మేడిన్ ఇండియా చిప్..
## దేశాభివృద్ధికి అత్యంత కీలకం




గ్రేటర్ నోయిడా

దేశీయంగా సెమీకండక్టర్ల తయారీ వంటి స్వయం సమృద్ధి చర్యల ద్వారానే 'అభివృద్ధి చెందిన భారత్'కు పునాదులు పడతాయని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఉత్తర ప్రదేశ్‌లోని జెవార్‌లో దిగ్గజ సంస్థలు హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్‌లు జాయింట్ వెంచర్ ద్వారా నిర్మించతలపెట్టిన 'ఇండియా చిప్ ప్రైవేట్ లిమిటెడ్'సెమీకండక్టర్ల తయారీ కర్మాగారానికి ప్రధాని మోదీ శనివారం శంకుస్థాపనచేశారు. "కోవిడ్ మహాసంక్షోభ కాలంలో సూక్ష్మ చిప్‌ల సరఫరా గొలుసులు తెగిపోవడంతో పలు ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి స్తంభించిపోయింది. పలు ఫ్యాక్టరీల పనులు పూర్తిగా ఆగిపోయాయి. భారత్ ఆత్మనిర్భరత సాధించినప్పుడే మన దేశం అభివృద్ధి చెందిన భారత్‌గా అవతరిస్తుంది. ఈ యజ్ఞంలో మేడిన ఇండియా చిఫ్ అనేది అత్యంత ముఖ్యం. ఈ దశాబ్దిలో సాంకేతికరంగంలో భారత్ ఏదైనా సాధిస్తుందో అదే 21వ శతాబ్దిలో మన శక్తిసామర్థ్యాలకు పునాదిగా మారుతుంది. చిప్‌లను దేశీయంగా తయారుచేసుకోవడం మొదలెడితే మన ఆధునిక పరికరాల తయారీ కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అగత్యం తప్పుతుంది. కోవిడ్ వేళ భారత్‌లోకి చిప్‌ల సరఫరా దారుణంగా దెబ్బతినడంతో ఇక్కడి కర్మాగారాల్లో ఉత్పత్తి కుంటుబడింది. ఆర్థికంగా సంస్థలు దెబ్బతిన్నాయి. ఈ సంక్షోభం నుంచి భారత్ పాఠాలు నేర్చుకుంది. దీనిని సదవకాశంగా భావించింది. చిప్ తయారీలో స్వావలంభనే మన ధ్యేయం. అందుకే భారత్‌లో సెమీకండక్టర్ల తయారీరంగాన్ని ప్రోత్సహిస్తున్నాం"అని మోదీ అన్నారు.

"గ్రేటర్ నోయిడా సమీప జెవార్‌లో యమునా ఎక్స్‌ప్రెస్ ఇండస్ట్రియలడెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ ఫెసిలిటీని ఏర్పాటుచేస్తున్నాం. ఇది ఉత్తరప్రదేశ్‌కు సాంకేతిక శక్తిగా కొత్త గుర్తింపును తీసుకొస్తుంది. యూపీ నుంచి ఎంపీగా గెలిచిన నాకు ఇది ఎంతో గర్వకారణం. వచ్చే రెండేళ్లలో ఇండియాచిప్ ఫ్యాక్టరీలో డిస్‌ప్లే డ్రైవర్ చిప్‌ల ఉత్పత్తి మొదలవుతుంది. వచ్చే ఐదేళ్లలో రూ.3,700 కోట్ల పెట్టుబడులు ఈ కంపెనీలో పెట్టనున్నారు. కొత్త పెట్టుబడులతో 3,500కుపైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలొస్తాయి"అని మోదీ అన్నారు.

## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే




నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని కామ్‌రూప్‌లో పోలీస్ శాఖ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులను కేవలం ఓటరు జాబితా నుంచి మాత్రమే కాదని, దేశం నుంచి కూడా తొలగిస్తామని అన్నారు. చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాల నుంచి వారిని తరిమికొడితే మరోచోట నివాసం ఏర్పరుచుకునే అవకాశం ఉందని, కాబట్టి వారిని దేశం నుంచే పంపించివేయాలని అన్నారు. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వారు చెప్పిన మాటలు విశ్వసించవద్దని, ఎందుకంటే వారికి చొరబాటుదా రులే ఓటు బ్యాంకు కాబట్టి వారిని పంపించలేరని అన్నారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అసోంకు ముప్పుగా పరిణమించాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి వస్తే కాంగ్రెస్ కట్టుబడి ఉంటే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలంలో అసోంను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

# సంపాదకీయం

## మారుతున్న కాలంలో మసకబారుతున్న మనుగడ

దేశ ప్రజల ఆర్థిక సామాజిక ప్రగతికి, ఒక జాతి అన్ని కోణాల్లోనూ అభివృద్ధి చెందడానికి విద్యతో పాటు వైద్య ఆరోగ్యరంగం కూడా ముఖ్యమని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కానీ, మన దేశంలో ఈ అంశాలే అత్యంత నిర్లక్ష్యానికి గురవుతుండటం బాధాకరం. మన మానవ వనరుల పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో చెప్పడానికి ఇటీవల జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) వెల్లడించిన గణాంకాలే నిదర్శనం. ఐదేండ్లలోపు చిన్నారుల్లో 67 శాతం, 15 నుంచి 49 సంవత్సరాల మహిళల్లో 57 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని వెల్లడించింది. ఈ లెక్కలు పదేండ్లపైన నిరాటంకంగా పాలిస్తున్న కేంద్రపాలకులకు చెంపపెట్టు లాంటిది. అయినా మన దేశాధినేతలు దేశం ప్రపంచ ఆర్థిక పటంలో వేగంగా ఎదుగుతోందని, ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పుకోవడం మాత్రం సిగ్గుచేటు. పిల్లల్ని కనే వయసున్న మహిళల్లో రక్తహీనత గత పదేండ్లలో నాలుగు శాతం పెరిగిందని సర్వేలో వెల్లడైంది. తల్లి ఆరోగ్యం బలహీనమైతే కుటుంబ ఆరోగ్యం దెబ్బతింటుంది; గర్భిణీల్లో రక్తహీనత ఉంటే తక్కువ బరువుతో పుట్టే శిశువులు, శిశుమరణాలు పెరుగుతాయి. ఈ పరిస్థితి తరతరాలుగా కొనసాగుతూనే ఉంది. పేదరికం వల్ల సరైన పోషకాహారం లేకపోవడమూ సమస్య ను మరింత పెంచుతున్నాయి. చిన్నారి జీవితం లోనూ తొలి ఐదేండ్లు శారీరక, మానసిక, మేధో అభివృద్ధికి అత్యంత కీలక దశ. ఈ సమయంలో ఏదీ తగ్గినా తరచూ అనారోగ్యానికి గురవుతారు. దీని ప్రభావం పాఠశాల విద్య నుంచి భవిష్య త్తు ఉపాధి అవకాశాల దాకా ఉంటుంది. ఈ సమస్యను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, తాము అధికారంలోకి రాగానే అందరికీ తిండి, ఆరోగ్యం, వైద్యం, వైద్యం, కనీస మౌలిక సదుపాయాలు అందిస్తామని చెప్పినప్పటికీ, అదే బాటలో బీజేపీ కూడా నిర్లక్ష్యం చేస్తోందని గణాంకాలను బట్టే అర్థమవుతోంది. పదేండ్లు దాటినా ఇప్పటికీ రక్తహీనతతో బాధపడేవారు, చనిపోయే వారి సంఖ్య పెరుగుతోంది తప్ప తగ్గడంలేదు. 2019లో ఎనీమియా ముక్త్ భారత్ (ఎఎంబి) పేరిట ఓ కార్యక్రమాన్ని చేపట్టినా... ఉపయోగం లేకపోగా, అమలే సరిగా లేదు. ప్రజా ఆరోగ్య వ్యవస్థపై పెట్టుబడులు తగినంతగా లేకుండా మాతా శిశువులకు బలవర్థకమైన ఆహారాన్ని అందించాలని ఎన్ని ప్రకటనలు చేస్తే లాభం? ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, పప్పులు, నూనెలు, ప్రోటీన్ వనరులు అందుబాటులో ఉంచడం, అంగన్‌వాడీ సేవలను విస్తరించడం, ఆశా కార్యకర్తలను పెంచడం ప్రధానం. ఇంకా చెప్పాలంటే ఆరోగ్య రంగంపై ప్రభుత్వ వ్యయాన్ని గణనీయంగా పెంచడం వంటి నిర్మాణాత్మక చర్యలు చాలా అవసరం. ఇవి చేయకుండా రక్తహీనత ఎలా తగ్గుతుంది? పన్నెండేండ్లుగా అధికారంలో కొనసాగుతున్న బీజేపీ పాలనలో కార్పొరేట్ కేంద్రీకృత ఆర్థిక విధానాలు వేగవంతమయ్యాయి; భారీ మౌలికవసతుల ప్రాజెక్టులు, కార్పొరేట్ పన్ను రాయితీలు, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ జరుగుతోంది. కార్పొరేట్లకు ఉపయోగపడే విధానాలు తప్ప పేదలకు ప్రయోజనం చేకూర్చే సంక్షేమ పథకాలను పటిష్టం చేయడం లేదు. ప్రజల పోషకాహార భద్రత, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను పూర్తిగా వదిలేసింది. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల సరఫరా నిరంతరాయంగా లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో పర్యవేక్షణ బలహీనంగా ఉండటం, అంగన్‌వాడీ వ్యవస్థకు బడ్జెట్‌లో నిధులు తగ్గించడం వంటివి తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ నిధులు తగ్గించి రాష్ట్రాలపై భారం మోపడం, మధ్యాహ్న భోజనం పథకాన్ని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ నిధులు తగ్గించడం వంటి అంశాలు మాతాశిశువుల్లో రక్తహీనతకు కారణమవుతున్నాయి. రక్తహీనతను తగ్గించడం అనేది కేవలం ఆరోగ్య సూచిక మెరుగుదల కాదు, అది దేశ మానవ మూలధనాన్ని బలోపేతం చేసే పెట్టుబడి. ఆర్థికంగా శక్తివంతమైన దేశం కావాలంటే ఆరోగ్యంగా, పోషకాహారంతో నిండిన భారత్ కావాలి. గణాంకాలు హెచ్చరికగా మారిన ఈ దశలో ప్రభుత్వం, సమాజం, కుటుంబాలు కలిసికట్టుగా కదలకపోతే అభివృద్ధి అంకెల్లో మాత్రమే కనిపిస్తుంది గానీ ప్రజల జీవితాల్లో ప్రతిఫలించదు. బియ్యం, గోధుమల పంపిణీతో మాత్రమే సమస్య పరిష్కారం కాదు, పప్పులు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు వంటి పోషకాలను ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి. ప్రజల ఆరోగ్యం, పోషకాహారం, గౌరవప్రద జీవనోపాధి హక్కుగా స్థాపించబడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యం. 'అందరికీ ఆరోగ్యం' నినాదాన్ని సాకారం చేయాలంటే ఆరోగ్య వ్యవస్థను మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలేసే విధానాలను పాలకులు విడనాడాలి.

# నేటి తరానికి ఆదర్శం... కొండా వెంకటప్పయ్య వ్యక్తిత్వం



ఆయన విలువలతో కూడిన నిబద్ధ త కలిగిన రాజకీయ నాయకుడు. దాన, ధర్మాల కోసం సొంత ఆస్తినే అమ్ముకొన్న దయా హృదయుడు. స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ఆద్యుడు, దేశభక్త బిరుదాంకి తుడు. ఆయనే నిస్వార్థానికి నిలు వెత్తు రూపం కొండా వెంకటప్ప య్య. దృఢ సంకల్పం, నిర్మలమైన ప్రవర్తన, అసమాన ధైర్యం, నిశ్చల మైన దీక్షా దక్షత, అరమరకలేని అమాయకత్వం, నిరాడంబర వ్యక్తిత్వం కలగలిపినదే కొండా వెంకటప్పయ్య జీవితం. శ్రోత్రియ కుటుంబంలో జన్మించినా, సనాతన సాంప్రదాయాల పరిధిని అతిక్రమిం చిన భిన్న మనస్తత్వం ఆయనది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమానికి మార్గదర్శకత్వం నెరపిన నాయక త్వం ఆయనది. కృష్ణా పత్రికను స్థాపించి తెల్లదొరలపై అక్షర అస్త్ర శస్త్రాలను సంధించిన అక్షర యోధుడు. గాంధీకే దేశ రాజకీయాల లోకి రాక ముందే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా న్యాయవాద వృత్తిని విడనాడి న త్యాగధనుడు. స్వాతంత్ర్యం వచ్చిన నాలుగు నెలలలో, 1947 డిసెంబరులో కొండా వెంకటప్ప య్య ...స్వాతం త్ర్యం తరువాత పెచ్చుపెరిగిన అవినీతి గురించి మహాత్మా గాంధీకి వ్రాసిన లేఖను బట్టి ఆయన తపన అర్థం అవుతుంది. "మనం మన స్ఫూర్తిగా కోరుకొన్న స్వరాజ్యం అనే ఒకే ఒక లక్ష్యం ప్రజలను మీ వెంట నడిపించింది. ఇప్పుడు ఆ గమ్యం చేరుకోగానే ఈ స్వాతంత్ర్య యోధులలో నీతి నియమాలు అంతరించి పోయాయి. రోజురోజు కూ పరిస్థితి దిగజారి పోతోంది. ప్రజలు కాంగ్రెసును దూషిస్తున్నారు. బ్రిటిషు రాజ్యమే మేలంటున్నారు. ఇప్పుడు స్వతంత్ర దేశంలో కాంగ్రెసు అవినీతికి ఆలవాలమై పోతున్నది. వారిని అదుపు చేయాల్సిన పోలీసు వ్యవస్థ కాంగ్రెసువారి కట్టడి లో ఉండి పోయింది. పైసా ఆదాయం లేని వారు ఇప్పుడు మహా రాజుల లాగా పెద్దపెద్ద కార్లలో తిరుగు తున్నారు. కాంగ్రెసు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తరచూ జోక్యం చేసుకోవడం వలన జిల్లా కలెక్టరులూ, రెవిన్యూ అధికారులూ తమ విధులను సక్రమంగా నిర్వర్తిం చ లేక పోతున్నారు. ఈ పైరవీ కారుల ప్రభావం దుష్ప్రచారం, భయంతో నిజాయితీగల వారు తమ పదవులలో ఉండే పరిస్థితి లేదు."విదేశీ పాలకుల దాస్య శృంఖలాల నుండి విముక్తి కలిగి, స్వతంత్ర భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న అనంతరం కేవలం , నాలుగు మాసాలకే 1947 డిసెం బర్‌లో కాంగ్రెస్ నేతల స్వార్థ చింతన గురించి గాంధీజీకి రాసిన లేఖలోని వ్యథా భరిత హృదయంలో నుండి వచ్చిన బాధతో నిండిన వాక్యాలివి. దీన్ని బట్టి ఆయన నీతి నిజాయితీ, నిబద్ధత, నిస్వార్థ భావన గురించి స్పష్టం అవుతుంది. కొండా వెంకటప్పయ్య (ఫిబ్రవరి 22, 1866 – ఆగష్టు 15, 1949) 1866, ఫిబ్రవరి 22 న పాత గుంటూరులో జన్మించాడు. ప్రాథమిక విద్య గుంటూరు మిషన్ స్కూలులో, ఉన్నత విద్య మద్రాసు క్రైస్తవ కళాశాలలో పూర్తిచేసి తరువాత బి.ఎల్. పట్టా పొంది, బందరులో న్యాయ వాద వృత్తిని చేపట్టాడు. ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలో, జాతిని చైతన్య వంతం చేయడానికి వెంకటప్పయ్య 1902లో వాసు నారాయణరావుతో కలసి కృష్ణా పత్రిక ప్రచురణను ప్రారంభించాడు. 1905 వరకు ఆయనే ఆ పత్రికను నడిపి, గుంటూరులో స్థిరపడగానే దాని సంపాదకత్వ బాధ్యతలను ముట్నూరు కృష్ణారావుకు అప్పగిం చాడు. న్యాయవాద వృత్తిలో వెంక టప్పయ్య ధనార్జన గురించి ఆయ న పట్టించుకోనే లేదు. దాన, ధర్మాల కోసం సొంత ఆస్తినే అమ్ము కొన్నాడు. 1912 మే నెలలో కృష్ణా గుంటూరు జిల్లా రాజకీయ మహా సభ నిడద వోలులో జరిగింది. ఆ సభలోనే కొండా వెంకటప్పయ్య సలహాపై ఉన్నవ లక్ష్మీనారాయణ మొదలగు యువకులు 11 తెలుగు జిల్లాలతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే విషయంలో మంతనా లు జరిపారు. 1913లో అదే స్థాయి లో మహాసభ బాపట్లలో జరిగింది. కొండా వెంకటప్పయ్య సలహా మేరకు మొదటి ఆంధ్ర మహాసభ (ఆంధ్ర) బి.ఎస్.శర్మ అధ్యక్షతన జరిగింది. దేశవ్యాప్త ప్రచారం కోసం ఏర్పడిన బృందంలో కొండా వెంకట ప్పయ్యదే ప్రధాన పాత్ర. నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభకు ఆయనే అధ్యక్షుడిగా ఉండి ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి నిర్దిష్ట కార్యక్రమం రూపొందించాడు. 1917లో రాజ్యాంగ సంస్కరణల విషయమై పరిశీలనలు జరపడానికి మాంటేగ్ – చమ్స్‌ఫర్డ్ ప్రతినిధి వర్గాన్ని ప్రభుత్వం నియమించింది. సదరు ప్రతినిధి వర్గం మద్రాసుకు వచ్చిన. సందర్భంలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన అవసరాన్ని. నొక్కి చెప్పిన ఆంధ్ర ప్రతినిధులలో కొండా వెంకటప్పయ్య ముఖ్యుడు. 1918లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ ఏర్పడింది. రాష్ట్ర సాధనలో ఇది తొలివిజయం కాగా, రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి తొలి కార్య దర్శి వెంకటప్పయ్యే. ఆ రోజుల్లో కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లా లు కలసిన నియోజక వర్గం నుంచి పోటీ చేసి కొండా వెంకటప్పయ్య మద్రాసు కౌన్సిలుకు ఎన్నిక య్యాడు. సహాయ నిరాకరణో ద్యమం కొనసాగించడానికి వీలుగా కాంగ్రెసు పార్టీ తన సభ్యుల రాజీనామా కోరగానే కొండా శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. తర్వాత ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడై భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడయ్యాడు. 1921 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీలలో అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు బెజవాడలో జరగగా, మహాత్ముని ఆంధ్ర పర్యటన వెంకటప్పయ్య ఆధ్వర్యంలోనే జరిగింది. వేలాది రూపాయల విరాళాలుగా స్వీకరించి స్వరాజ్య నిధికి సమర్పించాడు. పెదనంది పాడు పన్నుల నిరాకరణోద్యంలో పాల్గొన్నందుకు ఆయన మొదటి సారి జైలు శిక్ష అనుభవించాడు. 1923లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన దేశబంధు చిత్తరంజన్ దాస్ రాజీనామా వల్ల వెంకటప్ప య్యను అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దుగ్గి రాల గోపాలకృష్ణయ్య అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శి అయ్యా డు. గాంధీజీ తలపెట్టిన ప్రతి ఉద్యమానికి ఆంధ్రలో కొండా వెంక టప్పయ్యే ఆ రోజుల్లో నాయకత్వం వహించేవాడు. ఆంధ్ర ఖద్దరుకు యావద్దేశ ప్రచారం లభించడానికి కొండా వెంకటప్పయ్య కృషి ప్రధాన మైనది. 1933లో మహాత్ముడు ఆంధ్రలో హరిజన యాత్ర చేపట్టి, అనేక గ్రామాలలో హరిజనుల దేవాలయ ప్రవేశం చేయించాడు. భార్య మృత్యు ఒడిలో ఉన్నప్పటికీ కొండా వెంకటప్పయ్య హరిజన సేవలో నిమగ్నుడై తిరుగుతున్నాడని మహాత్మాగాంధీచేత కొనియాడ బడినాడు.

1929లో సైమన్ కమిషన్ రాక సందర్భంలో, 1930లో ఉప్పు సత్యాగ్రహంలో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు కొండా వెంకట ప్పయ్య జైలు శిక్షలు అనుభవిం చాడు. 1937లో జరిగిన ఎన్నికల్లో అతను మద్రాసు శాసన సభకు ఎన్నికయ్యాడు. భాషా ప్రాతిపదికన మద్రాసు రాష్ట్రాన్ని ఆంధ్ర, తమిళ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలుగా విభిజించాలని కొండా వెంకటప్పయ్య శాసన సభలో ప్రవేశ పెట్టిన తీర్మా నం ఏకగ్రీవంగా నెగ్గింది. ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో 1920 నుండి 1949లో మరణించే వరకు ఆంధ్ర దేశమే తానుగా వ్యవహరించి ఆంధ్రుల అభిమానానికి పాత్రుడైన గొప్ప వ్యక్తి వెంకటప్పయ్య. ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సభకు కూడా అధ్యక్షుడిగా పని చేశాడు. అఖిల భారత చరఖా సంఘానికి జీవిత కాలం సభ్యుడిగా ఉన్నాడు. గ్రంథాలయోద్యమానికి తోడ్పడ్డాడు. దేశ, రాష్ట్ర రాజకీయాలలో, కాంగ్రెస్ పార్టీ లో తమకంటూ ప్రత్యేక స్థానం ఉన్న కొండా, స్వార్థ రాజకీయ నాయకుల మూలంగా తన ప్రతిభకు, త్యాగానికి సముచిత స్థానం పొందలేక పోయాడు. కొండా వెంకటప్పయ్య 1949 ఆగష్టు 15 న దేశ స్వాతంత్ర్య దినాన లోకాన్ని ఈ వదిలి వెళ్లాడు. ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శం కావాలి.

# దేశ తొలి విద్యా మంత్రి అబుల్ కలాం




దేశంలో విద్య అభివృద్ధికి తొలి బాట వేసిన విద్యాధికుడు అబుల్ కలాం ఆజాదే. ఆయన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపు కుంటారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ (నవంబర్ 11, 1888 --- ఫిబ్రవరి 22, 1958) స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి. ఆయన అసలుపేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కా నగరంలో జన్మించారు. ఆయన వంశస్తులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్ లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు/ మౌలానాల వంశం నుండి వచ్చారు. ఆయన తల్లి అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాలు గల ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమయంలో భారత దేశం నుండి మక్కా వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. 1890 లో అయన తమ కుటుంబంతో కలకత్తా వచ్చారు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించారు. ఆయన విద్య ఇంట్లో సాగింది. మొదట తండ్రి పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించారు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం నేర్చుకున్నారు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నారు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందారు. ఆయన దివ్య ఖురాన్ పై భాష్యం రాశారు. స్వయంగా కవి సాహితీవేత్త అయిన ఆయన 'ఇండియా విన్స్ ఫ్రీడమ్'ను రాశారు. విదేశాల నుంచి తిరిగి వచ్చాక ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసుకున్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టారు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్ లకు పరిమితం అయిన విషయం ఆజాద్ కు తెలిసి రెండు సంవత్సరాలలో, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటు చేసారు. ఆసమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించ సాగారు. ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశం యొక్క స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తున్నాదని భావించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరులను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నించారు. 1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించారు. ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ –ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను "అల్ బలఘ్" ప్రారంభించారు. మౌలానా ఆజాద్, గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయినారు. ఆయనను ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1940 (రాంగఢ్) లో కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికై, 1946 వరకు ఆ పదవిలో ఉన్నారు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాల పాటు జైలుశిక్ష అనుభవించారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చింది. అంతేకాదు ఆయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్ప బడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వ విద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వ విద్యాలయాలు స్థాపించ బడ్డాయి. ఆయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును "జాతీయ విద్యా దినోత్సవం"గా నిర్ణయించింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు, విద్యా వ్యవస్థను మెరుగు పరిచేందుకు అంకిత భావంతో పనిచేశారు. చిన్నపిల్లల్లో ప్రాథమిక విద్యను ప్రోత్సహిం చడానికి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడాన్ని ప్రోత్సహిం చారు. పాఠశాలలు, కళాశాలల నిర్మణానికి జాతీయ కార్యక్రమాన్ని ప్రణాళికను రూపొందించారు. 14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించే ఆలోచనను ఆయనే ముందుకు తెచ్చారు. అలాగే "ప్రతి ఒక్కరూ ప్రాథమిక విద్యను పొందడం వ్యక్తి జన్మహక్కుగా పరిగణించాలి. లేదంటే పౌరులుగా తమ విధులను పూర్తిగా నిర్వర్తించలేరు" అని అబుల్ కలామ్ ప్రాథమిక విద్య గురించి వివరించారు. అంతే కాదు, ఆడపిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో అనేక పథకాలను తీసుకొచ్చారు. ఆయన మార్గదర్శకత్వం మరియు నాయకత్వంలో విశ్వవిద్యాలయ గ్రాంట్ కమిషన్ (యుజిసి)ని విద్యా మంత్రిత్వ శాఖ 1953లో స్థాపించింది. అలాగే 1951లో అబుల్ నాయకత్వంలో మొదటి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్థాపించ బడింది. ఆయన ఒక దూరదృష్టిగల వ్యక్తి, భవిష్యత్ సాంకేతిక నిపుణులను రూపొందించడంలో ఐఐటిల సామర్థ్యాన్ని నమ్ముతారు. "ఈ ఇన్స్టిట్యూట్ స్థాపన దేశంలో ఉన్నత సాంకేతిక విద్య మరియు పరిశోధనల పురోగతిలో ఒక మైలురాయిగా మారుతుంది అనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు" అని మౌలానా ఆజాద్ పేర్కొన్నారు. గాంధీజీ ఆయనను "భారత ప్లాటో" అని, గాంధీ , నెహ్రూ ఆయనను మౌలానా, మీర్–ఎ–కారవాన్ అని పిలిచేవాడు. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించింది.

# పిల్లల బాధ్యత ఎవరిది?



భార్యా భర్త ఇద్దరూ కలిసి జీవించినంత కాలం పిల్లల బాధ్యత తల్లిదండ్రులిద్దరికీ ఉంటుంది. కానీ పరిస్థితులు అనుకూలించకపోయినా, భర్త వేరే సంబంధాలు పెట్టుకొని కుటుంబాన్ని పట్టించుకోకపోయినా, వదిలేసి వెళ్లిపోయినా, విడాకులు తీసుకున్నా పిల్లల్ని చూసుకునే బాధ్యత తల్లిపైనే ఉంటుంది. ఎన్ని కష్టాలు వచ్చినా తల్లి తన బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. అలాంటి కథనం గురించే ఈ వారం ఐద్వా అదాలత్ (ఐలమ్మ ట్రస్ట్)లో తెలుసుకుందాం...శృతికి దాదాపు 36 ఏండ్లు ఉంటాయి. ఆమెకు మనీష్‌తో పెండ్లి జరిగి 20 ఏండ్లు అవుతుంది. ముగ్గురు పిల్లలున్నారు. బాబు పదో తరగతి, ఒక పాప ఎనిమిది, మరో పాప ఆరో తరగతి చదువుతున్నారు. శృతి ప్రభుత్వ ఆఫీసులో కాంట్రాక్ట్ 'మీ అమ్మ నా ఇంట్లో ఎందుకు ఉండాలి' అని గొడవ పెట్టుకునేవాడు. దాంతో ఆమె రాకుండా ఆగిపోయింది. మనీష్ ప్రవర్తనపై గతంలో నాలుగైదు సార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. కానీ అతనిలో ఎలాంటి మార్పు లేదు.

ఇక మనీష్ వాళ్ల అమ్మను పిలిపించి 'అత్తమ్మ.. మనీష్ ఎలాగో ఉద్యోగానికి సరిగ్గా వెళ్లడం లేదు. నేను ఉద్యోగానికి వెళుతుంటే పిల్లల్ని పట్టించుకోలేకపోతున్నాను. పిల్లలు ఏమైపోతారో అని భయంగా ఉంది. మీ అబ్బాయి ఉద్యోగం చేయకపోయినా పర్లేదు. కనీసం పిల్లలను అయినా చూసుకుంటే బాగుంటుంది. కానీ ఆయన చెప్పాపెట్టకుండా వారం పది రోజులు ఇల్లు వదిలి ఎక్కడికో వెళ్లిపోతున్నాడు. నేను అడిగితే 'నా ఇష్టం నేను ఎక్కడ ఉండాలనుకుంటే అక్కడ ఉంటాను. నువ్వెవరు నన్ను అడగటానికి' అంటున్నాడు. మీరైనా పిల్లల్ని చూసుకుంటే నేను ఉద్యోగం చేసుకుంటాను' అంది. అప్పటి నుండి ఆమె పిల్లల్ని చూసుకుంటుంటే శృతి ఉద్యోగానికి వెళుతుంది.

శృతి ఉద్యోగం షిఫ్టులుగా ఉంటుంది. రాత్రి షిఫ్టుల్లో వెళ్లడం, రావడం ఇబ్బందిగా ఉండేది. దాంతో వాళ్ల ఆఫీసుకు దగ్గరలో ఇల్లు తీసుకున్నారు. పిల్లలు కూడా పెద్దవాళ్లయ్యారు. శృతి ఉదయాన్నే లేచి వంట చేసి ఆఫీసుకు వెళ్లేది. వచ్చిన తర్వాత మిగతా పని చేసుకునేది. మనీష్ మాత్రం ఇంట్లో సరిగ్గా ఉండేవాడు కాదు. పైగా శృతికి ఎవరితోనే సంబంధం ఉందని అనుమానించి కొట్టేవాడు. ఇలా చాలా సార్లు జరిగింది. తల్లి కూడా అతన్ని చాలా సార్లు తిట్టింది. దాంతో తల్లిని కూడా ఇంట్లో నుండి గెంటేశాడు.

శృతినే బతిమలాడుకొని ఆమెను తిరిగి పిలిపించుకుంది. ప్రస్తుతం చిన్న బాబు ఐదో తరగతి చదువుతున్నాడు. పిల్లలు భయపడి 'నాన్న మనకు వద్దు' అంటూ ఏడుస్తున్నారు. మనీష్ ఏమో ఒక ట్రాన్స్ జెండర్‌తో కలిసి వేరే ఉంటున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఆమె సహాయం కోసం ఐద్వా లీగల్ సెల్‌కు వచ్చింది.

మేము మనీష్‌ను వాళ్ల అమ్మను పిలిచి మాట్లాడితే 'నేను తప్పు చేశాను. నా కొడుక్కు ఇచ్చి పెండ్లి చేసి ఆ అమ్మాయి జీవితం నాశనం చేశాను. అందుకే నేను ఆమెకే సపోర్ట్ చేస్తున్నాను. మనీష్ బాధ్యత లేకుండా తిరుగుతున్నాడు. నేను శృతితో ఉండి పిల్లల్ని చూసుకుంటాను. మనీష్ గురించి అయితే నాకు తెలియదు. అతను మారతాడనే నమ్మకం కూడా నాకు లేదు. మీరే ఏదో ఒకటి చేయండి. ఎంతైనా తల్లిని కదా.. నా కొడుకూ కోడలు సంతోషంగా ఉండాలనే ఉంది' అన్నది. మనీష్ మాట్లాడుతూ శృతి వేరే వాళ్లతో సంబంధం పెట్టుకుంది. అందుకే నేను వాళ్లందరినీ వదిలి పెట్టి వెళ్లిపోయాను. ఆమె నన్ను కనీసం ఓ మనిషిగా కూడా చూడడం లేదు. చివరకు పిల్లలు కూడా నన్ను తిడుతున్నారు. అలాంటి ఇంట్లో నేను ఎలా ఉంటాను? ఇక నేను ఆమెతో కలిసి ఉండలేను' అన్నాడు.

శృతి మాట్లాడుతూ 'నాకు వేరే వాళ్లతో సంబంధం ఉంటే భర్త కావాలని, అతనిలో మార్పు రావాలని ఎందుకు వస్తాను? అత్తమ్మ నా దగ్గర దాదాపు పదేండ్ల నుండి ఉంటుంది. ఆమెకు నేనేంటో తెలుసు. కాబట్టే నాకు సపోర్ట్ చేస్తుంది. కుటుంబాన్ని చూసుకోవడం చేతగాక ఇలాంటి మాటలు మాట్లాడుతున్నాడు. నన్నే తప్పు పడుతున్నాడు. ఈయన నన్ను ఎంత ఇబ్బంది పెట్టినా కేవలం పిల్లలకు తండ్రి కావాలనే ఉద్దేశంతోనే సర్దుకుపోతున్నాను. ఇక అతనితో నేను కలిసి ఉండలేను. ఇప్పుడూ ఆయన మా కోసం చేస్తుంది ఏమీ లేదు. ఏదో చుట్టం చూపుగా వచ్చిపోతున్నాడు. ఇక ఇప్పుడు అది కూడా అవసరం లేదు' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

మధ్యలో మనీష్ తల్లి కల్పించుకొని 'అయితే నా పేరుతో ఉన్న పొలాన్ని శృతి, పిల్లల పేరుపై రాస్తాను' అంది. దానికి మనీష్ ఒప్పుకోలేదు. 'భార్యా పిల్లలతో ఉండకుండా నీ ఇష్టం వచ్చిన దగ్గర నువ్వు ఉంటే నీకెందుకు రాస్తాను' అంది. మూమే కల్పించుకుని 'చూడు మనీష్.. నువ్వు భార్యా పిల్లలతో కలిసి ఉండనంటున్నావు. ఇక నీకు ఆస్తి ఎలా వస్తుంది? శృతి కష్టపడి పిల్లల్ని పోషించుకుంటుంది. నువ్వు పట్టించుకోకపోతే ముగ్గురు పిల్లల్ని చూసుకోవల్సిన బాధ్యత ఆమెదే కదా. నీకెలా నీకు నచ్చినట్టు జీవించే హక్కు ఉందో, అలాగే శృతికి కూడా ఉంటుంది. శృతికి అండగా మీ అమ్మ, పిల్లలు ఉన్నారు. నీకే ఎవ్వరూ లేరు. రేపు నీ పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించుకో' అన్నాము. శృతితో 'నీ భర్త మారకుండా ఇలాగే ప్రవర్తిస్తే నీ నిర్ణయం నవ్వు తీసుకో. నీకు మీ అత్తమ్మ తోడు ఉంది. అలాగే మేము కూడా కావల్సిన సహకారం అందిస్తాము' అని ధైర్యం చెప్పి పంపించాము.

# కొన్ని జాగ్రత్తలు పాటిస్తే...



ప్రస్తుతం మన జీవితంలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు భాగంగా మారిపోయాయి. కొందరి ఉద్యోగాలు అయితే వీటి మీదే ఆధారపడి ఉంటున్నాయి. తరచూ అంతర్జాలంతో గడిపేవారు గంటల తరబడి పీసీల ముందు కూర్చుంటున్నారు. ఇలా ఎక్కువసేపు డిజిటల్ పరికరాల తెరను చూస్తే కండ్లు ఒత్తిడికి గురై అలసిపోవచ్చని కంటి నిపుణులు చెబుతున్నారు. కొన్నిసార్లు చూపు కూడా దెబ్బతినొచ్చని హెచ్చరిస్తున్నారు. కాబట్టి తప్పనిసరిగా కంప్యూటర్‌తో పనిచేసేవారు కొన్ని జాగ్రత్తలు పాటించటం మంచిదని సూచిస్తున్నారు.

-మరీ ప్రకాశవంతమైన లైట్ల వెలుగులో పనిచేస్తే కష్టపడి చూడాల్సి ఉంటుంది. ఫలితంగా కండ్లు త్వరగా, బాగా అలసిపోతాయి. కాబట్టి తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి.

-డిస్‌ప్లే మీద యాంటీగ్లేర్ స్క్రీన్ బిగిస్తే కండ్లకు హాయిగా ఉంటుంది. ఒకవేళ కళ్లద్దాలు ధరిస్తే యాంటీ రిఫ్లెక్టింగ్ పూత ఉన్నవి తీసుకోవాలి. ఇది తెర నుంచి ప్రతిఫలించే కాంతిని కళ్లకు అంతగా చేరకుండా అడ్డుకుంటుంది.

-ఒకవైపు ప్రింట్ తీసుకున్న పేజీని, మరోవైపు కంప్యూటర్ తెరను మార్చి మార్చి చూడాల్సి వస్తే తెర పక్కన స్టాండ్‌కు పేజీని అమర్చుకోవాలి. స్టాండు మీద తగినంత వెలుతురు పడేలా చూసుకోవాలి. మీరు డెస్క్ ల్యాంప్‌ను వాడుతున్నట్టయితే దీన్నుంచి వచ్చే కాంతి.. కండ్ల మీద, కంప్యూటర్ తెర మీద గానీ పడకుండా చూసుకోవాలి.

-చేసే పని నుంచి తరచూ విరామం తీసుకోవాలి. ప్రతి గంటకూ కనీసం 10 నిమిషాల సేపు విశ్రాంతి తీసుకుంటే మంచిదని నిపుణులు అంటున్నారు. కంప్యూటర్ మీద పనిచేయటం వల్ల తలెత్తే మెడ, వీపు, భుజాల నొప్పి తగ్గటానికిది సాయపడడమే కాకుండా ఇది కండ్ల మీద ఒత్తిడి తగ్గిస్తుంది.

-డిస్‌ప్లే సెటింగ్స్ మార్చుకోవడం వల్ల కండ్లకు ప్రయోజనం ఉంటుంది. చుట్టుపక్కల పరిస్థితులకు అనుగుణంగా డిస్‌ప్లే బ్రైట్‌నెస్ మార్చుకోవాలి. వెబ్ పేజీలో తెల్ల భాగాన్ని చూసినప్పుడు కాంతి వస్తున్నట్టు అనిపిస్తే చాలా బ్రైట్‌గా ఉందని.. మసకగా, బూడిద రంగులో కనిపిస్తే డార్క్‌గా ఉందని అర్థం చేసుకోవాలి. టెక్స్ట్‌సైజు, కాంట్రాస్ట్‌నూ సౌకర్యవంతంగా ఉండేలా అడ్జస్ట్ చేసుకోవాలి.

-దూరం వస్తువులను 10-15 సెకండ్ల పాటు చూసి, వెంటనే దగ్గర వస్తువుల మీద 10-15 సెకండ్ల సేపు దృష్టి పెట్టాలి. ఇలా పది సార్లు చేస్తే.. తదేకంగా స్క్రీన్‌ను చూసినప్పుడు బిగుసుకున్న కండరాలు వదులవుతాయి.

-తరచూ కంటి రెప్పలను ఆడిస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల కండ్లు పొడి బారకుండా, చికాకు పడకుండా ఉంటాయి. ఒకవేళ కండ్లు తడారితే డాక్టర్‌ను సంప్రదించాలి. కంప్యూటర్ తెరకూ కండ్లకు మధ్య 20 నుంచి 24 అంగుళాల దూరం ఉండేలా చూసుకోవాలి. తెర మధ్య భాగం కండ్లకు సుమారు 10 నుంచి 15 డిగ్రీల దిగువన ఉండేలా కూర్చోవాలి. ఫలితంగా తల, మెడ మరీ కిందికి లేదా పైకి లేకుండా చూసుకోవచ్చు. కండ్ల మీద అతిగా భారం పడకుండా కాపాడుకోవచ్చు.

# చలికాలంలో చర్మం డల్ అవ్వకుండా ఇలా చెయ్యండి?



మన శరీరంలో విటమిన్స్ లోపించడం వల్ల చర్మం పొడిగా, నిర్జీవంగా మారుతుంది. మన చర్మం కళను కోల్పోయినట్టుగా కనబడుతుంది. అనేక చర్మ సమస్యలు కూడా తలెత్తుతాయి. కాబట్టి మన శరీరంలో విటమిన్స్ లోపం లేకుండా చూసుకోవాలి. శరీరంలో ఏయే విటమిన్స్ లోపించడం వల్ల ఎలాంటి చర్మ సమస్యలు వస్తాయో ఇంకా చర్మ ఆరోగ్యానికి ఏయే విటమిన్లు చాలా అవసరమో ఇప్పుడు మనం తెలుసుకుందాం. మన శరీరంలో విటమిన్ ఇ లోపించడం వల్ల చర్మం పొడిబారడుతుంది. చర్మం చాలా నీరసంగా కనిపిస్తుంది. అలాగే చర్మంలో తగినంత తేమ ఉండదు. కాబట్టి చర్మ ఆరోగ్యానికి విటమిన్ ఇ ఎంతో అవసరం. శరీరానికి తగినంత విటమిన్ ఇని అందించడం వల్ల చర్మం కాంతివంతంగా తయారవుతుంది. పైగా వాతావరణ కాలుష్యం కారణంగా కూడా చర్మం దెబ్బతినకుండా ఉంటుంది. చర్మం ఛాయ పెరుగుతుంది. ఇంకా ఫ్రీరాడికల్స్ కారణంగా చర్మానికి నష్టం కలగకుండా ఉంటుంది. చర్మం చాలా ఆరోగ్యవంతంగా తయారవుతుంది. ఇంకా విటమిన్ డి లోపించడం వల్ల కూడా చర్మ సమస్యలు తలెత్తుతాయి. ఈ విటమిన్ డి లోపించడం వల్ల చర్మం తరుచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడుతుంది. తామర, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. చర్మం బాగా పొడిబారుతుంది. కాబట్టి విటమిన్ డి లోపం తలెత్తకుండా చూసుకోవాలి. తగినంత విటమిన్ డి ని అందించడం వల్ల చర్మం రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇంకా చర్మం పొడిబారకుండా ఉంటుంది. అలాగే వ్యాధి కారక క్రిముల నుండి చర్మానికి హాని కలగకుండా ఉంటుంది. ఇంకా అలాగే చర్మ ఆరోగ్యానికి విటమిన్ సి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఖచ్చితంగా ఇది ఒక యాంటీ ఆక్సిడెంట్ గా పని చేసి ఫ్రీరాడికల్స్ నుండి చర్మానికి హాని కలగకుండా కాపాడుతుంది. తగినంత విటమిన్ సి అందించడం వల్ల చర్మం చాలా యవ్వనంగా ఉంటుంది. అలాగే ముడతలు పడకుండా ఉంటుంది. ఇక చర్మ ఆరోగ్యానికి బి విటమిన్స్ కూడా ఖచ్చితంగా చాలా అవసరం. ఎందుకంటే బి విటమిన్స్ లోపించడం వల్ల చర్మం పొడిగా మారుతుంది. ఇంకా పెదాలు పలుగుతాయి. చర్మంపై ముడతలు, మచ్చలు ఇంకా దద్దుర్లు వంటివి వస్తాయి. కాబట్టి చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే తగినన్ని బి విటమిన్స్ ఉండడం చాలా అవసరం. బి విటమిన్స్ లో యాంటీ ఇన్ ప్లామేటరీ లక్షణాలు చాలా పుష్కలంగా ఉంటాయి. ఇవి ఇన్ ప్లామేషన్ ను తగ్గించి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

# బాత్ రూమ్‌లో ఈ వస్తువులు ఉంటే.. దురదృష్టం వెంటాడినట్టే!

వాస్తు నియమాలను అనుసరించి ఇల్లు కట్టుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. వీటి వల్ల మీకు అదృష్టం వెతుక్కుంటు మరీ వస్తుందని వాస్తు శాస్త్ర నిపుణులు చెబుతూ ఉంటారు. అంతే కొన్ని ప్రదేశాల్లో కొన్ని వస్తువులను కూడా పెట్టకూడదంటారు. దాని వల్ల ఇంట్లో నెగిటివ్ ఎనర్జీ పెరుగుతుంది. దీని వల్ల అనేక ఇబ్బందలను ఎదుర్కొనాల్సి వస్తుంది. దీని వల్ల కుటుంబంలో ఆర్థిక పరిస్థితులతో ఇబ్బంది పడటం, గొడవలు, తగాదాలు వంటివి నెలకొంటి. ఇవే వాస్తు నియమాలు బాత్ రూమ్ లో కూడా వర్తిస్తాయి. బాత్ రూమ్ లో ఉండే వస్తువుల విషయంలో సరైన జాగ్రత్తలు పాటించాలి. వీటి వల్ల కూడా నెగిటివ్, పాజిటివ్ ఎనర్జీల ఎఫెక్ట్ పడతాయి. అసలు బాత్ రూమ్ లో ఎలాంటి వస్తువులు ఉండాలి? ఎలాంటి వస్తువులు ఉండకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.

అద్దాలు: బాత్ రూమ్ లో పెట్టే అద్దాల విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. చాలా మంది బాత్ రూమ్ లో అద్దాలను పెట్టు కుంటారు. వీటి వల్ల నష్టాలే ఎక్కువగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. అలాగే బాత్ రూమ్ లో ఉండే అద్దం ఎప్పుడూ విరిగి పోయి ఉండకూడదు. ఒక వేళ ఉంటే వెంటనే దాన్ని పారేయాలి. లేకుంటే ప్రతి కూలతలను సృష్టిస్తాయి.

బకెట్లు: బాత్ రూమ్ లో ఉండే బకెట్లు ఎప్పుడూ ఖాళీగా ఉండకూడదట. ఒక వేళ ఖాళీ బకెట్ ఉంటే దాన్ని బోర్లించి పెట్టాలి. బాత్ రూమ్ లో ఖాళీ బకెట్ ఉంటే.. అది ఇంట్లో ఉండే డబ్బులను ఖాళీ చేస్తుంది. అలాగే విరిగి పోయిన, పగిలిన బకెట్లు కూడా ఉండకుండా చూసుకోండి.

మొక్కలు- చిత్రాలు: చాలా మంది ఇప్పుడు బాత్ రూమ్ లో మొక్కలను కూడా పెడుతున్నారు. బాత్ రూమ్ లో మొక్కలను పెట్టడం అసలు ఏమాత్రం మంచిది కాదని వాస్తు శాస్త్ర నిపుణులు అంటున్నారు. అలాగే ఎండి పోయిన మొక్కలు ఉంటే వెంటనే వాటిని తొలగించాలి. అదే విధంగా డెకరేషన్ కోసం బాత్ రూమ్ లో చిత్రాలను కూడా పెడుతూ ఉంటారు. ఇవి చినిగి పోయి ఉంటే వాటిని పారేయాలి.

ట్యాప్ లీక్ అవ్వకూడదు: బాత్ రూమ్ లో ఎప్పుడూ ట్యాప్ లీక్ కాకుండా చూసుకోండి. ఇలా లీక్ అవ్వడం వల్ల ప్రతికూల శక్తిని వ్యాపింప చేస్తుంది. అంతే కాకుండా ఆర్థిక పరిస్థిపై చెడు ప్రభావం పడుతుంది.



# కామారెడ్డిలో రాజకీయ సెగలు

# బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

**నిజామాబాద్ :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో రాజకీయ సెగలు ఒక్కసారిగా మిన్నంటాయి. భూముల కబ్జా ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు విసురుకున్న సవాళ్లతో పట్టణం యుద్ధవాతావరణాన్ని తలపించింది. కామారెడ్డిలో గత కొద్దిరోజులుగా సాగుతున్న భూకబ్జా ఆరోపణలు బహిరంగ చర్చకు దారితీశాయి. బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అరోరా భూములను కబ్జా చేశారని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను సవాల్‌గా తీసుకున్న ఎమ్మెల్యే, దమ్ముంటే తన క్యాంప్ ఆఫీస్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన కాంగ్రెస్ శ్రేణులు చర్చకు సిద్ధమవ్వడంతో ఉద్రిక్తత మొదలైంది. ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరించి, కాంగ్రెస్ నేత, మాజీ సర్పంచ్ గిరి రెడ్డి మహేందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి బీజేపీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడికి బయలుదేరారు. కాంగ్రెస్ నాయకులు నేరుగా ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకోవడంతో అక్కడ అప్పటికే వేచి ఉన్న బీజేపీ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణ హింసాత్మక రూపం దాల్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన బీజేపీ కార్యకర్తలు మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి ప్రయాణిస్తున్న కారుపై దాడికి దిగారు. కారు అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా, ఉద్రేకంతో కారును అమాంతం బోల్తా పడేయడం × కలకలం రేపింది. ఈ అనూహ్య ఘటనతో అక్కడ ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది.

శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. చర్చకు వెళ్లకుండా ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డిని ఆయన నివాసంలోనే హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన బయటకు రాకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. పోలీసుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అధికార పక్షం అండతోనే పోలీసులు తనను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఘర్షణలు జరగకుండా పట్టణంలోని పలువురు ముఖ్యమైన బీజేపీ మరియు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి





తీసుకున్నారు. ఉదయం నుంచే నేతల ఇళ్ల వద్ద నిఘా పెంచారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టడంతో పాటు, అనుమానితులను పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులతో రాజకీయ శ్రేణుల్లో తీవ్ర అసహనం వ్యక్తమైంది. చర్చా వేదికగా ప్రకటించిన శిశు మందిర్ పాఠశాల పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అక్కడ భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి, అపరిచిత వ్యక్తులు ఎవరినీ అటువైపు వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. వందలాది మంది పోలీసుల మోహరింపుతో ఆ ప్రాంతం కర్ఫ్యూను తలపించింది. మీడియా ప్రతినిధులను కూడా పరిమితంగానే అనుమతించారు. చర్చా వేదిక నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీ ప్రదర్శనగా బీజేపీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వైపు వెళ్లడానికి ప్రయత్నించాయి. ఈ క్రమంలో రెండు పార్టీల కార్యకర్తలు ముఖాముఖి ఎదురుపడటంతో వాగ్వాదం మొదలై, అది కాస్తా తీవ్ర స్థాయి దాడులకు దారితీసింది. పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో ఆ ప్రాంతమంతా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ గందరగోళంలో కాంగ్రెస్ నాయకుడికి చెందిన కారును బీజేపీ కార్యకర్తలు లక్ష్యంగా చేసుకున్నారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పుతుండటంతో పోలీసులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కారు బోల్తా పడిన ఘటన తర్వాత మరింత ఘర్షణ జరగకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు ఇరు వర్గాలను చెదరగొట్టి, క్యాంప్ ఆఫీస్ పరిసరాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కామారెడ్డిలో పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. బహిరంగ చర్చ పేరుతో మొదలైన ఈ వివాదం భౌతిక దాడుల వరకు వెళ్లడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు హౌస్ అరెస్టులు, మరోవైపు రోడ్లపై దాడులతో జిల్లా కేంద్రం స్తంభించిపోయింది. గొడవకు కారణమైన ప్రధాన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం క్యాంప్ ఆఫీస్ పరిసరాల్లో 144 సెక్షన్ తరహా ఆంక్షలు అమలు చేస్తున్నారు.

# ప్రతిభవంతుల గుర్తింపే ప్రభుత్వ లక్ష్యం

**సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలో గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే భాగంగా క్రీడా పోటీలను నిర్వహించి, ప్రతిభా వంతులను గుర్తింపు జరిగే విధంగా చీఫ్ మినిస్టర్ కప్ 2025 రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ ప్రాజెక్టు పై జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నరసయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసినప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్పు పేరిట గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులను గుర్తించడానికి, ప్రతిభా గల క్రీడాకారులకు ప్రోత్సాహకాలుగా అందజేస్తున్నట్లు వారు చెప్పారు.. ప్రతిభను గుర్తించి శిక్షణ ఇవ్వడానికి శిక్షకుల నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని శారీరక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది అని చెప్పారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయి వరకు ఆటలనే నినాదం మేరకు ఈ పోటీలను గ్రామస్థాయి నుండి నిర్వహించి ప్రతిభావంతులు పంపుతామన్నారు..విద్యార్థులు యువకులు పెట్టే అవకాశాన్ని ఉపయోగించుకొని తన ప్రతిభను చాటి ఒలంపిక్ స్థాయిలో ఎదగాలని కోరారు. రాష్ట్రస్థాయి సైకిల్ పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి సుమారు 400 మంది విద్యార్థులు యువకులు పాల్గొన్నారు మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు




పంపిణీ చేశారు. ఈ క్రీడలు రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాస్, కోశాధికారి చింతకింది శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ సౌందర్య, ఖేలో ఇండియా కోచ్ సంజీవ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ మంగారెడ్డి, సిద్దిపేట్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చిన్నకోడూర్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, చంద్లాపూర్ సర్పంచ్ శేఖర్, మాజీఎఫ్ సెక్రటరీ పాతూరి సుజాత, రామేశ్వర్ రెడ్డి, మాలతి, సువర్ణ లత, ఉప్పలయ్య, సిద్దిపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోచులు సైక్లిస్టులు తదితరులు పాల్గొన్నారు. సైక్లింగ్ టెక్నికల్ టీం గా దత్తాత్రేయ, విజయ్ కాంత్ రావు, విజయభాస్కర్, అల్లాడి కృష్ణ, ధర్మ తేజ తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యం

**వనపర్తి :** నిరుపేదల సొంతింటి కల నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని, గతంలోనూ ఇందిరమ్మ రాజ్యంలోనే నిరుపేదలకు ఇండ్లు మంజూరయ్యాయని నేడు రేవంత్ రెడ్డి సర్కార్ లోనే రూ. ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తూ నీరు పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు శుక్రవారం వనపర్తి మండలం చందాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న పుల్లరి నీలమ్మ నాగరాజు గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరై దంపతులకు నూతన వస్త్రాలను అందించి అభినందనలు తెలిపారుఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి నిర్మాణం కోసం కలలుగన్న మా కుటుంబానికి నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి మాకు ఓ సొంత గూడును ఏర్పాటు చేసుకునేందుకు 5 లక్షల రూపాయలు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి కి, వనపర్తి నిరుపేదల ఆశాజ్యోతి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు అంటూ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారుతమ ఆర్థిక స్తోమత సరిగా లేక ఇరుకు ఇళ్లల్లో ఉంటూ జీవనం గడిపామని, ఇక సొంత ఇంటి కల నెరవేరదు అనుకుని నిరాశ చెందిన మాకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి రూ.5 లక్షల రూపాయలు అందజేసిందని ఇలాంటి ప్రభుత్వం అధికారుల



పాటు ప్రజలకు సేవలందించాలని వారు కృతజ్ఞతలు తెలియజేశారుకార్యక్రమంలో వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటయ్య యాదవ్, అమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఆధార్ కార్డు కాదు..
## ఇకపై ఇది ఉంటేనే మహిళలకు ఫ్రీ బస్సు..!

**హైదరాబాద్ :** మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల కోసం ఆర్టీసీ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అర్హులకే ప్రయోజనం అందేలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ కార్డులు జారీ చేయాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు, ఇతర రాష్ట్రాల మహిళల వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి నగరంలో విశేష స్పందన లభిస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో సుమారు 3,200 బస్సులు నడుస్తుండగా, అందులో దాదాపు 2 వేల ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. రోజుకు సుమారు 5 లక్షల మంది ప్రయాణికుల్లో దాదాపు 2 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఆక్యుపెన్సీ రేషియో కూడా 90 శాతానికి చేరింది.అయితే, ఇటీవల ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. సుమారు 25 నుంచి 30 వేల వరకు అనుమానాస్పద ప్రయాణాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరుగుతున్న నేపథ్యంలో స్మార్ట్ కార్డు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. స్మార్ట్ కార్డులను చిప్ ఆధారిత టెక్నాలజీతో రూపొందించనున్నారు. కార్డులో లబ్ధిదారుల పేరు, చిరునామా, ప్రత్యేక ఐడీ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపిస్తే టికెట్ జారీ చేస్తున్న కండక్టర్లు, కొత్త విధానంలో స్మార్ట్ కార్డును టికెట్ ఇష్యూయింగ్ మెషీన్‌తో స్వైప్ చేస్తారు. వెంటనే టికెట్ జనరేట్ అవుతుంది. దీంతో ప్రయాణ ధృవీకరణ మరింత పారదర్శకంగా ఉంటుంది. ఆధార్ కార్డులను ప్రతిసారి వెంట తీసుకెళ్లాల్సిన ఇబ్బంది తగ్గడంతో పాటు, అర్హులైన మహిళలకు సౌకర్యవంతమైన విధానం అమల్లోకి రానుంది. స్మార్ట్ కార్డు జారీ విధానం, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఈ చర్యలు కీలకంగా మారనున్నాయి.

## నిస్వార్థ నాయకత్వమే దేశానికి ముఖ్యం..
### నితిన్ నబీన్‌కు మహంత్ స్వామి మహారాజ్ ఆశీస్సులు

**హైదరాబాద్ :** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తర్వాత తిన్ నబిన్ తొలిసారిగా గుజరాత్ రాష్ట్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గాంధీనగర్‌లోని సుప్రసిద్ధ పూజ్య స్వామినారాయణ్ అక్షరధామ్ క్షేత్రాన్ని సందర్శించి, పవిత్ర మహంత్ స్వామి మహారాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్రానికి విచ్చేసిన ఆయనకు ఘనస్వాగతం లభించింది. అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ భేటీలో నితిన్ నబిన్ మహంత్ స్వామి మహారాజ్ నుండి ఆశీర్వాదాలు తీసుకున్నారు. దేశంలో నిరంతర శాంతి, ఐక్యత, సామరస్యం, శ్రేయస్సు వెల్లివిరియాలని స్వామిజీ ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నైతిక విలువలతో కూడిన నాయకత్వం దేశాభివృద్ధికి ఎంతో అవసరమని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో నితిన్ నబిన్ వెంట పలువురు బిజెపి అగ్రనేతలు ఉన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్, జగదీష్ విశ్వకర్మ, రత్నాకర్జీ సహా పలువురు నేతలు ఆయన వెంట ఉన్నారు. మహంత్ స్వామి మహారాజ్ తన సందేశంలో.. కరుణ, నిస్వార్థ నాయకత్వం, సమగ్రత వంటి విలువలను ప్రతి నాయకుడు అలవర్చుకోవాలని సూచించారు. సమాజ సమగ్ర అభివృద్ధికి, సాంస్కృతిక విలువల పరిరక్షణకు ఉమ్మడి నిబద్ధత అవసరమని ఈ సమావేశం చాటిచెప్పింది. అక్షరధామ్ యొక్క ప్రశాంత వాతావరణంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక సంభాషణ ప్రజా జీవితంలో నైతిక విలువల ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది.

## ఫ్రీగా టమాటా

**వరంగల్ :** టమాటా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అమ్మకానికి మార్కెట్‌కు తరలించిన టమాటా కొనే నాధుడు కరువయ్యాడు. కనీస గిట్టుబాటు ధర లేదు.. చేతికి అందిన పంట కుళ్లిపోతుండటంతో కొందరు రైతులు కడుపుమండి వినూత్న నిరసన తెలిపారు. వినియోదారులకు టమాటాలు ఉచిత సరఫరా చేసి ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని వారాంతపు సంతలో ఈ విచిత్ర సంఘటన జరిగింది. ఒక ట్రాలీ లోడ్ టమాటలు రైతులు ఉచితంగా సరఫరా చేశారు. ఆ టమాటాల కోసం జనం ఇగబడి సంచులు, బట్టలతో ఎగబడ్డారు. సాధారణ సమయంలో టమాటా ధరలు సెంచరీ కొట్టిన సందర్భం కూడా ఉంది. కానీ ఇప్పుడు టమాటా ధరలు నేల చూపులు చూస్తున్నాయి. రైతులు కనీసం కిలో 2 రూపాయల ధర పలకని టమాటా ధర చూసి బిత్తర పోతున్నారు. చేతికి అందిన ఆ పంటను ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఒకటికాదు రెండు కాదు ఏకంగా 1200 కిలో ఒక ట్రాలీ లోడ్ టమాటాలు ఉచితంగా పంపిణీ చేశారుఈ ఉచిత పంపిణీ సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో జరిగింది. వారాంతపు సంత సందర్భంగా గూడూరు మండలం భూపతిపేట గ్రామానికి చెందిన సారయ్య, మోహన్, సురేందర్ అనే రైతులు టమాట పంటను అమ్మకానికి తీసుకువచ్చారు. అయితే ఆశించిన స్థాయిలో గిరాకీ లేకపోవడంతో పాటు ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో తీవ్ర నిరాశ చెందిన రైతులు ఆ టమాటా ఇంటికి తీసుకెళ్లలేక అక్కడే ఉచితంగా పంపిణీ చేశారు. అప్పులు చేసి కష్టపడి పంట వేస్తే ధరలు దారుణంగా పడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అయిజలో అగ్నిప్రమాదం.. భారీగా ఆస్తి నష్టం

**జోగులాంబ గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజలో అగ్నిప్రమాదం జరిగింది. అయిజలోని ఓ ప్రైవేటు కంపెనీలో భారీగా మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో స్థానికులు భయంతో వణికిపోయారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. ప్రాణ నష్టం గురించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు
## హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహం
### క్రియేటర్లు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలి
### జాగృత్ హైదరాబాద్ – సురక్షిత్ హైదరాబాద్' క్యాంపెయిన్‌లో నగర సిపి సజ్జనార్ పిలుపు

**హైదరాబాద్ :** సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్, ఐపిఎస్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న 'జాగృత్ హైదరాబాద్ – సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ నూతన విధానానికి విశేష స్పందన లభిస్తోంది. పోలీసుల పిలుపు మేరకు పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సైబర్ నేరాల తీరుతెన్నులను వివరిస్తూ తమదైన శైలిలో వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిని హైదరాబాద్ సిటీ పోలీస్, సిపి విసి సజ్జనార్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో 'కొలాబరేట్' చేయడం ద్వారా లక్షలాది మందికి చేరువ చేస్తున్నారు. వినోదాత్మకంగా ఉంటూనే, అత్యంత కీలకమైన సైబర్ భద్రతా సూచనలను ఈ వీడియోలు ప్రజలకు అందిస్తున్నాయి.

## ట్రాఫిక్ నిబంధన పట్ల ప్రజల్లో చైతన్యం రావాలి:

**సిద్దిపేట :** ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అర్రైవ్ అలైవ్ కార్యక్రమం లో భాగంగా చేసిన సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఒక సరికొత్త శ్రీకారానికి పలువురు కంటెంట్ క్రియేటర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్రాఫిక్ నిబంధనలపై ఆసక్తికరమైన వీడియోలు రూపొందించారు. దీనికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావాన్ని గుర్తించి, స్థానిక సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు మరియు కంటెంట్ క్రియేటర్స్ సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, మరియు ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించే విధముగా , ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించేలా చిన్న చిన్న వీడియోలు సోషల్ మీడియాలో వీడియోలు రూపొందించాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోరి మరిన్ని డిజిటల్ క్రియేటర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ కోరారు.





## ఆ 10 జంటలు వీళ్లేనా?

## బిగ్‌బాస్ తరహాలో కొత్త రియాలిటీ షో..

రియాలిటీ షోలంటే జనాలకు భలే ఇష్టం. రీల్ లైఫ్‌లో సెలబ్రిటీలను చూసి ఆరాధించే ప్రేక్షకులు వారు రియల్ లైఫ్‌లో ఎలా ఉంటారో తెలుసుకోవాలని తెగ తహతహలాడుతుంటారు. అందుకేగా బిగ్‌బాస్ షో అనేక భాషల్లో ఫేమస్ అయింది. బిగ్‌బాస్ తరహాలోనే హిందీలో ఇటీవల ద 50 అనే షో కూడా మొదలైంది. ఇప్పుడు తెలుగులో ఒక కపుల్ షో రాబోతోంది. అదే మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్. ది అల్టిమేట్ టెస్ట్ ఆఫ్ లవ్ అనేది క్యాప్షన్.

**10 జంటలు - 70 రోజులు**

ఈ షోలో సెలబ్రిటీ జంటలు మాత్రమే పాల్గొననున్నారు. అందులో పెళ్లయినవాళ్లున్నారు. పెళ్లి చేసుకోకుండా డేటింగ్‌లో ఉన్నవారూ ఉన్నారు. 10 సెలబ్రిటీ జంటలు ఒక అద్భుతమైన విల్లాలో 70 రోజులపాటు ఉండనున్నారు. ఈ జంటల మధ్య ప్రేమ, రొమాన్స్, డ్రామా.. ఇలా అన్ని ఎమోషన్స్ చూపించనున్నారు. షో నిర్వాహకులు పెట్టే ప్రేమ పరీక్షలను వీరు ఎలా దాటుతారు? అన్నది ఆసక్తికరంగా ఉండనుంది.

**ఆ జంటలెవరంటే?**

ప్రస్తుతం సోషల్‌మీడియాలో వినిపిస్తున్న ఊహాగానాల ప్రకారం ఆ 10 జంటలెవరో ఓసారి చూసేద్దాం.. అమర్‌దీప్- తేజు, హరిత- హరీశ్, ప్రియాంక- శివకుమార్, అంజలి - పవన్ సంతోష్, నటరాజ్ మాస్టర్- నీతూ, సోనియా సింగ్- సిద్ధు, జబర్దస్త్ నూకరాజు- ఆసియా, సాంద్రా- మహేశ్‌బాబు, వాసంతి - పవన్ కల్యాణ్, శుభశ్రీ రాయగురు- అజయ్.

**అప్పుడే ప్రారంభం?**

వీరిలో అమర్‌దీప్, హరీశ్ (మాస్క్ మ్యాన్), ప్రియాంక జైన్, నటరాజ్ మాస్టర్, వాసంతి కృష్ణన్, శుభశ్రీ.. వీళ్లందరూ బిగ్‌బాస్ ద్వారా బుల్లితెర ఆడియన్స్‌కు దగ్గరైనవారే! మార్చి 2వ వారంలో ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్‌లో ఈ షో మొదలు కానున్నట్లు తెలుస్తోంది. ఓటీటీలో వచ్చిన బిగ్‌బాస్ అగ్నిపరీక్ష బాగానే హిట్టయింది. మరి మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్ ఎలాంటి స్పందన తెచ్చుకుంటుందో చూడాలి!



## ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ ఓటీటీ రిలీజ్ ఫిక్స్..

మాస్ రాజా నటించిన ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ ఓటీటీ రిలీజ్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు గుడ్ న్యూస్ అందింది. థియేటర్లలో విడుదలైన తర్వాత నెల రోజుల్లోనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పైకి రావాల్సి ఉన్న ఈ చిత్రం, అనూహ్యంగా ఆలస్యం కావడంతో ప్రేక్షకుల్లో గందరగోళం నెలకొంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా త్వరలోన్గే జుజు5లో స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. సినిమా డిజిటల్ రిలీజ్ ఆలస్యం కావడానికి ప్రధాన కారణం ఇతర భాషల డబ్బింగ్ పనులేనని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఒకేసారి విడుదల చేయాలని జీ5 ప్లాన్ చేసినట్లు సమాచారం. మల్టీ లాంగ్వేజ్ స్ట్రాటజీతో పాన్-ఇండియా స్థాయిలో ప్రేక్షకులను చేరుకోవాలన్నదే ఈ నిర్ణయానికి కారణంగా తెలుస్తోంది. ఇటీవల చిరంజీవి నటించిన ‘మన శంకర వరప్రసాద్ గారు ’ చిత్రాన్ని ఏడు భాషల్లో విడుదల చేసి మంచి స్పందన పొందిన నేపథ్యంలో, అదే తరహా వ్యూహాన్ని ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ విషయంలోనూ అమలు చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి కిషోర్ తిరుమల దర్శకత్వం వహించారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటించి ప్రేక్షకులను అలరించారు. థియేటర్లలో మంచి వినోదాన్ని పంచిన ఈ చిత్రం, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకుంది. ఐదు భాషల్లో ఒకేసారి విడుదలవుతుండటంతో ఈ సినిమా మరింతమంది ఆడియన్స్‌ను చేరుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజ ఫ్యాన్స్‌తో పాటు ఇతర భాషల ప్రేక్షకులు కూడా ఈ ఎంటర్టైనర్‌ను ఆస్వాదించే అవకాశముంది. థియేటర్లలో మిస్ అయిన వారు ఇప్పుడు ఓటీటీలో ఈ చిత్రాన్ని వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తానికి, ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ డిజిటల్ రిలీజ్‌తో మాస్ రాజా అభిమానులకు మరోసారి ఫుల్ ఎంటర్టైన్‌మెంట్ దక్కనుంది. త్వరలో అధికారిక రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లు సమాచారం.



## ఆ హిట్ సినిమా నా బయోపిక్.. ఒకేసారి 26 క్లియర్ చేశా

హీరోగా రెండు సినిమాలు చేసినప్పటికీ ఒక్కటీ సక్సెస్ కాలేదు. అయినా సరే వరస వివాదాలతో వార్తల్లో నిలిచాడు చంద్రహాస్. ఈ నెల ప్రారంభంలో ‘బరాబర్ ప్రేమిస్తా’ మూవీతో థియేటర్లలోకి వచ్చాడు. ఇదొక సినిమా ఉందని కూడా తెలియనంతగా ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది. దీని రిలీజ్ టైంలోనే ‘గుంజీ గుంజీ’ అనే బూతు పాట పాడి వివాదానికి కారణమయ్యాడు. ఓ జర్నలిస్టుకి వార్నింగ్ ఇచ్చి హాట్ టాపిక్ అయిపోయాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఇతడు.. తన గురించి మరిన్ని ఆసక్తికర విషయాల్ని బయటపెట్టాడు. ఇప్పటికీ తాను ఇంకా పూర్తిగా మెచ్యూర్ కాలేదని చెప్పిన చంద్రహాస్.. అప్పట్లో ఏ మాత్రం కోపం వచ్చినా సరే ఎవరనేది చూడకుండా చేయెత్తి కొట్టేసేవాడినని చెప్పుకొచ్చాడు. అలానే ప్రదీప్ రంగనాథన్ తీసిన ‘డ్రాగన్’ సినిమా తన బయోపిక్ అని అన్నాడు. అందులో చూపించినట్లే.. తాను కూడా నిజజీవితంలో చివరి సెమిస్టర్‌లో ఒకేసారి 26 సబ్జెక్టులు క్లియర్ చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నాడు. అప్పట్లో తన తండ్రి స్పైడర్ మ్యాన్ డ్రస్ కొనిస్తే.. దాన్ని వేసుకుని కింద ఇంటిలో ఉన్న పిల్లలకు చూపిస్తే.. డ్రస్ వేసుకుంటే సరిపోదు. స్పైడర్ మ్యాన్‌లా ఎగరాలి అని చెప్పేసరికి రెండో ఫ్లోర్ నుంచి కిందకు దూకేశానని కూడా చంద్రహాస్ చెప్పుకొచ్చాడు. అవకాశం లభిస్తే దర్శకులతో రాజమౌళి, సందీప్ రెడ్డి వంగాతో పనిచేయాలని అనుకుంటున్నట్లు కూడా చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ ఈ వీడియో బిట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

చంద్రహాస్ విషయానికొస్తే టీవీ నటుడు ప్రభాకర్ కొడుకు. తొలుత ‘రామ్‌నగర్ బన్నీ’ అనే మూవీ చేశాడు. 2024లో ఇది థియేటర్లలోకి వచ్చింది. ఏ మాత్రం ఆకట్టుకోలేకపోయింది. దీని ప్రమోషన్ల టైంలోనే కాస్త వింతగా ప్రవర్తించడం, మాట్లాడటంతో యాటిట్యూడ్ స్టార్ అని ట్రోల్ చేశారు. ఈ పేరుని తనకు ట్యాగ్‌గా పెట్టేసుకున్న చంద్రహాస్.. తొలి రెండు మూవీస్‌కి అదే ట్యాగ్ వేసుకోవడం విశేషం.

## జాతకం ప్రకారం.. ముందే థియేటర్లలోకి శ్రీ విష్ణు ‘విష్ణు విన్యాసం’

కథను నమ్మి సినిమాలు చేస్తూ.. ప్రేక్షకులకు కావాల్సిన వినోదాన్ని అందించే పనిలో బిజీగా ఉన్న యాక్టర్లలో ముందు వరుసలో ఉంటాడు శ్రీ విష్ణు విలక్షణమైన పాత్రలతో ఇంప్రెస్ చేసే శ్రీ విష్ణు తాజాగా ‘విష్ణు విన్యాసం’ మూవీ చేస్తున్నాడని తెలిసిందే. క సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తుంది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్నఈ మూవీ టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఒంగోలు నేపథ్యంలో ఉండబోతున్న ఈ చిత్రంలో శ్రీ విష్ణు ‘చిన్నూ’ అనే పాత్రలో కనిపించనున్నాడు. జాతకాలు, వాస్తుపై విపరీతమైన నమ్మకంతో శ్రీ విష్ణు చేసే పనులు, దాని చుట్టూ తిరిగే ఎలిమెంట్స్ నేపథ్యంలో సాగే టీజర్‌లో శ్రీ విష్ణు యాస, డైలాగ్స్ మూవీ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని ముందుగా ఫిబ్రవరి 28,2026న థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. అయితే ఒక రోజు ముందుగానే సినిమా రాబోతుంది. జాతకం ప్రకారం... ఈ ఫిబ్రవరి 27 నుంచి థియేటర్లలో నవ్వుల వర్షం కురుస్తుంది. మీ జాతకంలో నాన్ స్టాప్ ఫన్ దోషం మొదలవుతుంది..అంటూ మేకర్స్ నయా రిలీజ్ అప్‌డేట్ షేర్ చేశారు. ఈ చిత్రానికి రాధన్ సంగీతాన్ని అందిస్తుండగా, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. శ్రీ విష్ణు నటించిన యాక్షన్ థ్రిల్లర్ ‘మృత్యుంజయ్’ ఫిబ్రవరి 27న రిలీజ్ కావాల్సి ఉండగా.. మార్చి 6కు విడుదల వాయిదా పడ్డది.




Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com